# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 119 | విశాఖపట్నం | 30-1-2026 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 119 | VISAKHAPATNAM | 30-1-2026 FRIDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902





2లో

## తిరుమల లడ్డూను రసాయనాలతో తయారు చేశారు: సత్యకుమార్



2లో

## కేసీఆర్‌కు నోటీసులు అందించిన సిట్.. నేడు విచారణ



6లో

## పార్కిన్సన్స్ వ్యాధి లక్షణాలు..



### ఉత్సాహంగా ప్రారంభమైన

# అరకు ఉత్సవాలు

**అరకు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లాలో ఆంధ్రా ఊటీ అరకులోయలో అరకు ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఫెస్ట్‌ను మంత్రులు కందుల దుర్గేశ్, గుమ్మడి సంధ్యారాణి జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను మంత్రులు పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ అరకు ఉత్సవం మన సంస్కృతిని కాపాడుతూ, మన ప్రాంత అభివృద్ధికి బాటలు వేస్తోందని ఈన్నారు. ఏపీ తూర్పు తీరాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మార్చడమే తమ సంకల్పమని వెల్లడించారు. అరకు ఉత్సవ్ -2026లో మంత్రులు కందుల దుర్గేశ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. అరకు ఉత్సవ్‌లో కళాకారులను మంత్రులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడారు. 'జల్ జంగిల్ జమీన్' స్ఫూర్తితో అరకును పర్యావరణహిత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుదామని పేర్కొన్నారు. స్వదేశీ దర్శన్ 2.0 ద్వారా రూ.29.88 కోట్లతో బొర్రా గుహలన్ను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. అత్యాధునిక లైటింగ్, ఫ్లోరింగ్, ప్రొజెక్ట్ మ్యాపింగ్, సేఫ్టీ రెయిలింగ్స్, పార్కింగ్, విజిటర్స్ ఎమినిటీస్, రెస్టారెంట్స్, సావనీర్ షాప్స్, ఈవీ బగ్గీలు, పర్యాటక సౌకర్యాలతో అంతర్జాతీయ స్థాయిలో అరకును అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.

రూ. 42.30 కోట్లతో హరిత రిసార్ట్స్ ఆధునికీకరణ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. అరకు హరిత యాత్రి నివాస్‌లో గదుల సంఖ్యను పెంచామని తెలిపారు. 40 నుంచి 60కి, మయూరి రిసార్ట్‌లో 65 నుంచి 98కి, తైడ జంగిల్ బెల్స్‌లో 13 నుంచి 26కు గదుల సంఖ్యను పెంచామని స్పష్టం చేశారు. అరకు, పాడేరు, లంబసింగిలో 60 హోమ్ స్టేలను గుర్తించినట్లు తెలిపారు. స్థానికంగా జీవనోపాధి అవకాశాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడించారు. అరకు కాఫీ తోటలను పర్యాటకంతో అనుసంధానం చేసి గిరిజన రైతులకు మరింత లాభం చేకూర్చేలా 'కాఫీ ఎక్స్ పీరియన్స్ సెంటర్స్' ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి కుటుంబానికీ ఒక పర్యాటక ఉపాధి లక్ష్యంతో రాబోయే పదేళ్లలో ప్రతి ఇంట్లో కనీసం ఒకరికి పర్యాటక రంగంలో ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు



## 'తెలుగు రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం ఏటా తగ్గుతోంది'.. ఆర్థిక సర్వేలో కేంద్రం వెల్లడి

2లో



## పర్యాటక రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం: అనిత

3లో

## ఏపీలో హోంగార్డు ఆస్తులు రూ.20 కోట్లు...


### ఏసీబీ సోదాల్లో బట్టబయలు!



**విజయనగరం, పతాకం న్యూస్:** విజయనగరం జిల్లాలో ఓ హోంగార్డు అక్రమాస్తుల వ్యవహారం తీవ్ర కలకలం రేపింది. జిల్లా పోలీస్ కార్యాలయంలో పనిచేస్తున్న నెట్టి శ్రీనివాసరావు అనే హోంగార్డు ఇళ్లు, ఇతర ఆస్తులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం ఉదయం మెరుపుదాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో అతడు ఆదాయానికి మించి సుమారు రూ. 20 కోట్ల విలువైన అక్రమాస్తులు ఉన్నట్లు గుర్తించారు. శ్రీనివాసరావు గతంలో సుమారు 15 ఏళ్ల పాటు ఏసీబీ విభాగంలోనే హోంగార్డుగా పనిచేయడం గమనార్హం. ఆ సమయంలో ఏసీబీ చేపట్టే దాడుల

(తరువాయి 2వ పేజీలో)

## విశాఖ జూ పార్కును సందర్శించిన పవన్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఏపీ డిప్యూటీ సీఎం, అటవీ, పర్యావరణ అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ గురువారం విశాఖపట్నంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలను సందర్శించారు. ఈ సందర్భంగా, తన తల్లి అంజనా దేవి పుట్టిన రోజును పురస్కరించుకుని రెండు జిరాఫీలను ఏడాది పాటు దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. వాటి సంరక్షణకు ఏడాది పాటు అయ్యే ఖర్చును తానే పూర్తిగా భరిస్తానని తెలిపారు. ఈ స్ఫూర్తితో జంతు సంరక్షణకు కార్పొరేట్ సంస్థలు కూడా ముందుకు రావాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. పర్యటనలో భాగంగా, జూపార్క్‌లో కొత్తగా నిర్మించిన ఎలుగుబంట్ల ఎన్‌క్లోజర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏనుగులు, నీటి ఏనుగులు, పులులు, సింహాల ఎన్‌క్లోజర్ల వద్దకు వెళ్లి వాటి వివరాలను జూ క్యూరేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. జూ నిబంధనలు పాటిస్తూ ఏనుగులు, జిరాఫీలకు స్వయంగా ఆహారం అందించారు. అనంతరం కంబాలకొండ ఎకో పార్క్‌ను సందర్శించిన పవన్ కల్యాణ్, అక్కడ ఏర్పాటు చేసిన 'నగర వనం'ను ప్రారంభించారు. పార్క్‌లోని చెక్క వంతెనపై కనోపీ వాక్ చేస్తూ, మార్గమధ్యలో ఉన్న మొక్కల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## ఒప్పందం

యూరప్‌తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారత ప్రయోజనాలకు పెనుముప్పు. రైతులు, కార్మికులు, సామాన్యుల ప్రయోజనాలకు పెద్దపీట వేయాల్సిన ఒప్పందాలు అందుకు భిన్నంగా జరుగుతుండటం ప్రమాదకరం. ఢిల్లీ వేదికగా నిర్వహించిన శిఖరాగ్ర సమావేశంలో కుదిరిన ఒప్పందం 'మదర్ ఆఫ్ డీల్స్' అని నేతలు ఆకాశానికెత్తేస్తున్నారు. 18 ఏళ్ల పాటు సాగిన వాణిజ్య చర్చలు ముగిసాయని భారత్, ఇయు ప్రకటించాయి. మన గణతంత్ర దినోత్సవానికి ఇయు అగ్రనేతలిద్దరూ ముఖ్య అతిథులుగా రావడం, వాణిజ్యపరమైన శక్తిగా రూపాంతరం చెందడం తమ ప్రభుత్వ ఘనతగా కేంద్రం ప్రకటించుకోవడం శోచనీయం. ప్రపంచం ఒక కుగ్రామంగా మారిందని, స్వేచ్ఛా వాణిజ్యం విస్తరించడం అత్యవసరమని ప్రపంచీకరణ ఒక్కటే సమస్త సమస్యలకు పరిష్కారమని నయా ఉదారవాదం ఊదరగొట్టింది. ఫలితంగా పశ్చిమ దేశాలు గరిష్ట లబ్ధి పొందాయి. ఇప్పుడు తమ మార్కెట్లలోకి ఎవరూ అడుగుపెట్టకూడదంటూ సుంకాలతో అమెరికా ఎడాపెడా విరుచుకుపడుతోంది. ప్రపంచాన్నంతటినీ అతలాకుతలం చేసైనా సామ్రాజ్యవాదాన్ని, కార్పొరేట్ శక్తులను బలోపేతం చేసేందుకు ఎత్తుగడలు వేస్తోంది. వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యను కిడ్నాప్ చేసి ఎత్తుకెళ్లడం, గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటాననడం... ఇలా ట్రంప్ ఎత్తుగడలన్నీ ప్రపంచంతోపాటు ఇయుపైనా ప్రభావం చూపాయి. యూరప్ దేశాల ఎఫ్‌డిఐలో 50 శాతం ఇప్పటికీ అమెరికా నుంచే వస్తోంది. తమ రక్షణ, ఆర్థిక మూలాలన్నీ అమెరికా చేతిలో ఉండటంతో విడగొట్టుకునేందుకు ఇయు ప్రయత్నిస్తున్నట్లు బయటకు కనిపిస్తున్నా... మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను దెబ్బతీసి తను బలపడాలన్న వాంఛే అందులో ప్రధానమన్నది బహిరంగ రహస్యం. ప్రజల ప్రయోజ నాలకంటే కార్పొరేట్ మిత్రుల ప్రయోజనాలే మిన్నగా భావిస్తున్న మోడీ సర్కారు ప్రపంచ దేశాలతో కుదుర్చు కుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు దేశ ప్రజానీకానికి నష్టకరంగా ఉండటం ఆందోళనకరం. 90 శాతానికిపైగా దిగుమతులపై టారిఫ్‌లను పూర్తిగా రద్దు చేయడం, గణనీయంగా తగ్గించడం ప్రాతిపదికగా తాజాగా ఇయుతో కుదుర్చుకున్న ఒప్పందం దేశ ప్రయోజనాలకు ప్రమాదకరం. ఈ చర్యలు భారతదేశ ఆటోమొబైల్స్, ఔషధ, యంత్ర పరిశ్రమలను తీవ్ర ప్రభావితం చేస్తాయి. ఇనుము, ఉక్కు, ఫార్మాస్యూటికల్స్, ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తులు, గొర్రె మాంసం తదితర ఉత్పత్తులపై ఇప్పటివరకూ భారీగా ఉన్న పన్నులన్నీ మొత్తంగా ఎత్తేయడంతో ఆ దిగుమతులన్నీ మన దేశ మార్కెట్‌ను ముంచెత్తనున్నాయి. కార్లు, వైన్ ధరలు తగ్గడం వల్ల మనదేశంలో సామాన్యుడికి కలిగే ప్రయోజనం సున్నా! దానినే గొప్పగా ప్రచారం చేసుకోవడం దారుణం. దిగుమతుల్లో టారిఫ్‌లపై కోత విధించడం మనదేశంలోని కార్మికులు, రైతులు, సామాన్యుల జీవనోపాధిని అతలాకు తలం చేసేదే. ఇండియా -మధ్య ప్రాచ్యం-యూరప్ ఆర్థిక కారిడార్ (ఐఎంఇసి)ని బలోపేతం చేయడమే ఎఫ్‌టిఎ లక్ష్యం. ఇజ్రాయిల్‌లోని హైఫా ఓడరేవును కీలక రవాణా కేంద్రంగా చేసుకోవాలని భావించడం మరో ప్రమాదకర అంశం. గాజాలో జాతి నిర్మూలనకు పాల్పడుతూ, అమెరికా, పశ్చిమ దేశాల మద్దతుతో మధ్య ప్రాచ్యంలో రక్తపాతం సాగిస్తున్న ఇజ్రాయిల్‌తో సంబంధాలను మరింతగా బలోపేతం చేసుకునేందుకు ఉవ్విళ్లూరుతుండటం గర్హనీయం. ఇటువంటి చర్యలను ఎంతమాత్రం అనుమతించకూడదు. మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం చేసుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలన్నింటిలోనూ దేశంలోని రైతులు, కార్మికులు, సామాన్యుల ప్రయోజనాలకు నీళ్లొదలడం క్షంతవ్యం కాదు. ఆ ఒప్పందాలన్నీ రద్దు చేయాలి. భారత్ -ఇయు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పూర్తి వివరాలను పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలి. ప్రజాస్వామ్యానికి తల్లి అంటూ వాగాడంబరం ప్రదర్శించడం మాని, కూలంకుషంగా చర్చ సాగేలా చూడాలి. దేశ ప్రయోజనాలే మిన్నగా ఒప్పందాలు చేసుకోవాలి. అలా చేసేలా ప్రజలు పాలకుల మెడలు వంచాలి.

## 'తెలుగు రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం ఏటా తగ్గుతోంది'

### ఆర్థిక సర్వేలో కేంద్రం వెల్లడి



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** 2026-27 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు 6.8 నుంచి 7.2 శాతం మధ్య ఉంటుందని కేంద్రం అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ 2026-2027కు భారత్‌లో స్థిరమైన వృద్ధి నమోదవుతుందని సర్వే అంచనా వేసింది. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా 2025-26 ఆర్థికసర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలోనే కేంద్ర ఆర్థిక సర్వేలో తెలుగు రాష్ట్రాల అభివృద్ధి ప్రస్తావించారు. తెలుగు రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం ఏటా తగ్గుతూ వస్తోందని పేర్కొంది. 2022-23 నుంచి 2025-26 వరకు ద్రవ్యోల్బణం భారీగా తగ్గినట్లు కేంద్రం పేర్కొంది. ముఖ్యంగా తెలంగాణలో ద్రవ్యోల్బణం 8.61 నుంచి 0.20 శాతానికి పడిపోయినట్లు పేర్కొంది. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో 7.57 నుంచి 1.39 శాతానికి దిగివచ్చినట్లు వెల్లడించింది. ఆసక్తికరమైన విషయం ఏంటంటే, తెలుగు రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం జాతీయ సగటు 1.72 శాతం కంటే తక్కువ నమోదైనట్లు ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ, ఏపీలో ధాన్యం దిగుబడి తక్కువగా నమోదైనట్లు కేంద్రం పేర్కొంది. అకాల వర్షాలే ఇందుకు కారణమని చెప్పింది. కొత్త నగరాల విస్తరణలో అమరావతి గురించి ఆర్థిక సర్వేలో కేంద్రం ప్రస్తావించింది. లోక్‌సభలో ఆర్థికసర్వే ప్రవేశపెట్టిన అనంతరం సభను ఫిబ్రవరి 1వ తేదీకి వాయిదా వేశారు. తెలంగాణలో సాగు విస్తీర్ణం భారీగా పెరిగిందన్న కేంద్ర ఆర్థికసర్వే, 2014-23 మధ్య 1.31 కోట్ల ఎకరాల నుంచి 2.21 కోట్లకు ఎగబాకినట్లు స్పష్టం చేసింది. మిషన్‌కాకతీయ, కాళేశ్వరం వల్ల సాగు విస్తీర్ణం పెరిగిందని పేర్కొంది. ఐటీ, ఫైనాన్స్ సేవల్లో తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలదే 40 శాతం వాటాగా ఆర్థికసర్వే స్పష్టం చేసింది. ఏఐ స్టార్టప్‌లలో తెలంగాణ వాటా 7 శాతంగా ఉందని, ఈ సెగ్మెంట్?లో 30 శాతంతో కర్ణాటక అగ్రస్థానంలో నిలిచిందని వెల్లడించింది. తయారీరంగం ఉద్యోగాల్లో తెలంగాణ 5 శాతం వాటా నమోదు చేసినట్లు పేర్కొంది. అత్యధిక వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో 4వ స్థానంలో హైదరాబాద్ ఉన్నట్లు పేర్కొంది. 2035 నాటికి హైదరాబాద్ జీడీపి 201.4 బిలియన్ డాలర్లకు పెరిగే అవకాశం ఉంది, మున్సిపల్ బాండ్ల జారీలో హైదరాబాద్‌ది అగ్రస్థానమని వివరించింది. హైదరాబాద్, వరంగల్ మధ్య 'రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టం' ఏర్పాటుకు చేస్తే బావుంటుందని ఆర్థిక సర్వే సూచించింది. వికసిత్ భారత్‌ను సాధించడంలో వ్యవసాయరంగం కీలకపాత్ర పోషిస్తుందని ఆర్థిక సర్వే తెలిపింది. దేశీయంగా తయారీ, ఎగుమతులు ఎలక్ట్రానిక్ రంగం వృద్ధికి దోహదం చేస్తున్నాయని సర్వే పేర్కొంది. ఇందులో మొబైల్ తయారీ కీలకమని చెప్పింది. పదేళ్లలో ఉత్పత్తి విలువ 30 రెట్లు పెరిగి రూ.18వేల కోట్ల నుంచి రూ.5.45 లక్షల కోట్లకు చేరిందని తెలిపింది. డిజిటల్ సేవల విషయంలో గ్రామాలు, పట్టణాల మధ్య అంతరం తగ్గుతోందని తెలిపింది.

## కేసీఆర్‌కు నోటీసులు అందించిన సిట్.. నేడు విచారణ



**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు పుట్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు నోటీసులు అందాయి. హైదరాబాద్ లోని నందినగర్ లో ఉన్న కేసీఆర్ నివాసానికి వెళ్లిన సిట్ అధికారులు నోటీసులు అందించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణ జరుపుతామని నోటీసుల్లో సిట్ అధికారులు పేర్కొన్నారు. కేసీఆర్ వయసు దృష్ట్యా విచారణ కోసం పోలీస్ స్టేషన్ కు రావాల్సిన అవసరం లేదని సిట్ తెలిపింది. హైదరాబాద్ నగర పరిధిలోని ఏదైనా ప్రాంతం వివరాలను తెలిపితే... అక్కడకే వచ్చి విచారణ జరుపుతామని పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, హరీశ్ రావు, సంతోష్ కుమార్ లను సిట్ విచారించింది. మళ్లీ అవసరమైతే విచారణకు పిలుస్తామని వారికి తెలియజేసింది. ఇప్పుడు గులాబీ బాస్ ను విచారణకు పిలవడంతో ఆ పార్టీలో ఉత్కంఠ నెలకొంది. రాబోయే రోజుల్లో ఈ కేసులో మరెన్ని మలుపులు చోటుచేసుకుంటాయో అనే ఆసక్తి సర్వత్ర నెలకొంది.

## ఏపీలో హోంగార్డు ఆస్తులు రూ.20 కోట్లు...

(మొదటిపేజీ తరువాయి)




రహస్య సమాచారాన్ని ముందుగానే తెలుసుకుని, అవినీతి అధికారులకు చేరవేసేవారని, అందుకు ప్రతిఫలంగా భారీ మొత్తంలో ముడుపులు తీసుకున్నారని తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంతోనే గతంలో అతడిని ఏసీబీ నుంచి జిల్లా పోలీస్ కార్యాలయానికి బదిలీ చేశారు. అయినప్పటికీ, పాత పరిచయాలతో తన అక్రమ కార్యకలాపాలను కొనసాగించినట్లు తెలుస్తోంది. విజయనగరం, విశాఖపట్నం, గుర్ల మండలంలోని శ్రీనివాసరావు ఇళ్లు, కార్యాలయాలతో పాటు అతడి బంధువులు, స్నేహితుల ఇళ్లపైనా ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఈ తనిఖీల్లో పలు విలాసవంతమైన భవనాలు, భూముల పత్రాలతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటి మార్కెట్ విలువ దాదాపు రూ. 20 కోట్లు ఉంటుందని అంచనా వేశారు.

## నేటి నుంచి 'అనకాపల్లి ఉత్సవ్'



**అనకాపల్లి, పతాకం న్యూస్:** విశాఖ ఉత్సవ్‌లో భాగంగా ఈనెల 30, 31 తేదీల్లో 'అనకాపల్లి ఉత్సవ్'ను ఘనంగా నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉత్సవ్‌కు ప్రధాన వేదిక అయిన అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంతోపాటు బెల్లం మార్కెట్ యార్డు, అచ్యుతాపురం మండలం కొండకర్ల ఆవ, పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయ్‌కుమార్ తమ పరిధిలోని అధికారులతో సమావేశాలు నిర్వహించి, ఉత్సవ్ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో 30వ తేదీ సాయంత్రం 7.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రముఖ గాయని సునీత ఆధ్వర్యంలో సంగీత విభావరి ఉంటుంది. ఈ కార్యక్రమ నిర్వహణకు స్టేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఫుడ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఫ్లవర్ షో పనులు మొదలయ్యాయి. ఎన్టీఆర్ స్టేడియంలో 31వ తేదీన ప్రముఖ గాయకుడు రామ్ మిరియాల ఆధ్వర్యంలో సంగీత విభావరి, క్రాకర్స్ షో, స్థానిక కళాకారుల ప్రదర్శనలు వుంటాయి. ముత్యాలమ్మపాలెం బీచ్‌లో విద్యుద్దీపాలు, టెంట్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఇక్కడ ఫొటో బూత్స్, లైవ్ బ్యాండ్, బీచ్ స్పోర్ట్స్, వాటర్ స్పోర్ట్స్ నిర్వహిస్తారు. ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. కొండకర్ల ఆవ వద్ద ఫొటో బూత్స్, బోటు షికారు, ఫ్లాష్ షాపింగ్ పనులు జోరందుకున్నాయి.

## తిరుమల లడ్డూను రసాయనాలతో తయారు చేశారు: సత్యకుమార్




**అమరావతి, పతాకం న్యూస్:** గత వైసీపీ ప్రభుత్వంపై ఏపీ ఆరోగ్య మంత్రి సత్యకుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జగన్ హయాంలో తిరుమల లడ్డూను కల్తీ చేశారని విమర్శించారు. కోట్లాది మంది భక్తులు ఎంతో భక్తిభావంతో స్వీకరించే ప్రసాదాన్ని కల్తీ చేసిన పాపం 'జగన్ అండ్ కో'దే అని అన్నారు. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడారని సిట్ నివేదిక ఇచ్చిందని తెలిపారు. రసాయనాలను ఉపయోగించి లడ్డూ తయారు చేశారని మండిపడ్డారు. రూ. 250 కోట్ల అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. అవినీతిపరులను జైలుకి పంపితే దాన్ని రెడ్ బుక్ రాజ్యాంగం అని ఎలా అంటారని ప్రశ్నించారు. రప్పా రప్పా అనేవాళ్లని, తప్పు చేసిన వాళ్లని వదిలేయాలి అనేలా జగన్ మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే వ్యక్తిగత విషయాలను కూడా కూటమి ప్రభుత్వానికి రుద్దే ప్రయత్నాన్ని వైసీపీ చేస్తోందని అన్నారు. సొంత ఖజానాను నింపుకోవడం కోసం నాణ్యత లేని మద్యం అమ్మి, ప్రజల ప్రాణాలు తీయడం జగన్ కు తప్పుగా అనిపించలేదని దుయ్యబట్టారు. ప్రజా సమస్యలపై మాట్లాడకుండా... అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. సత్యసాయి జిల్లా కదిరిలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గర్భిణి మరణిస్తే... ప్రభుత్వ ఆసుపత్రిలో ఆమె మరణించినట్టు ప్రచారం చేస్తున్నారని సత్యకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు ప్రైవేట్ ఆసుపత్రిని మూసివేశామని చెప్పారు. విజిటర్ పొలిటీషియన్ మాదిరి జగన్ వారానికి ఒకరోజు ఏపీకి వచ్చిపోతున్నాడని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంపై గౌరవం ఉంటే అసెంబ్లీకి రావాలని అన్నారు. జగన్... మీరు ఆత్మవిమర్శ చేసుకోవాలి... లేకపోతే మీ రాజకీయ సమాధిని మీరే కట్టుకున్నట్టవుతుందని చెప్పారు.

## టూరిజం పేరుతో ఆదివాసీల హక్కుల ఉల్లంఘన: బొజ్జిరెడ్డి




**మారేడుమిల్లి, పతాకం న్యూస్:** మారేడుమిల్లి గుడిసె గ్రామంలో గిరిజనుల హక్కుల ఉల్లంఘనపై ఏపీ ఎస్.టి కమిషన్ గురువారం విచారణ చేపట్టింది. మారేడుమిల్లి మండలం పుల్లంగి పంచాయతీ పరిధిలోని గుడిసె గ్రామంలో 2022 నుంచి సి బి యి టి కమిటీ-ఫారెస్ట్ శాఖల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం పరస్పర సమన్వయంతో టూరిజం నిర్వహణ జరుగుతోంది. అయితే ఒప్పందం కుదిరి మూడేళ్లు గడుస్తున్నా, గ్రామానికి రోడ్లు, తాగునీటి సౌకర్యం, గృహాలు, సరైన పాఠశాల వంటి కనీస మౌలిక వసతులు ఇప్పటికీ కల్పించలేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు. గుడిసె పేరుతో జరుగుతున్న టూరిజం ద్వారా కోట్ల రూపాయల వ్యాపారం సాగుతున్నా, ఆ లాభాలు గ్రామాభివృద్ధికి ఉపయోగించక పోవడం తీవ్ర అన్యాయమని గ్రామస్థులు పేర్కొన్నారు. అంతేకాక, గిరిజనులు తాగునీటిని వినియోగించే కాలువలలోనే టూరిస్టులు మలమూత్ర విసర్జ నలు చేయడం వల్ల ఆరోగ్య, పర్యావరణ సమస్యలు తీవ్రంగా మారుతున్నాయని తెలిపారు. మండలంలో ఏ మూలలో చూసినా ప్లాస్టిక్ చెత్త, పగిలిన మద్యం సీసాలు అడవిలో విపరీతంగా పడేయడం వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని కాపాడాలని చెప్పే ఫారెస్ట్ శాఖ, అడవిలో భోజనం చేస్తున్న ఆదివాసీలపై మాత్రం జరిమానా లు వేస్తోంది, కానీ అడవిని కాలుష్యం చేస్తున్న టూరిజం మాఫియాపై చర్యలు తీసుకోవడం లేదు. ఇటీవల అడవిలో భోజనం చేస్తున్న ఆదివాసీలపై ఫారెస్ట్ అధికారులు అనవసరంగా జరిమానా విధించారని మితిమీరిన వేగంతో వాహనాలు నడిపించడం వల్ల గిరిజనులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నా ఒక్క అధికారి బాధ్యత వహించేదిలేదన్నారు.

# పర్యాటక రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం: అనిత



**అనకాపల్లి, పతాకం న్యూస్:** రాష్ట్ర పర్యాటక రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. గురువారం అనకాపల్లి జిల్లాలో అనిత పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనకాపల్లి ఉత్సవ్ నేపథ్యంలో ముత్యాలమ్మపాలెం తీరంలో.. విద్యుత్ దీపాలు, బీచ్ స్పోర్ట్స్, వాటర్ స్పోర్ట్స్, లైవ్ బ్యాండ్, ఫుడ్ స్టాల్స్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా ఉన్నారు. అనకాపల్లి ఉత్సవ్‌ను ఈనెల 30, 31 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయని హోం మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల ఆధ్వర్యంలో ఏపీలో పర్యాటక శాఖ అభివృద్ధి చెందుతోందని చెప్పుకొచ్చారు. గతంలోనూ విశాఖపట్నం ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించామని ఆమె గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక కళాకారులకు ఈ ఉత్సవాల్లో అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని హోం మంత్రి తెలిపారు. ఈ మేరకు ముత్యాలమ్మపాలెం తీరంలో అనేక కార్యక్రమాలు జరగనున్నాయని తెలిపారు. కొండకర్లలోనూ వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశామని వివరించారు. అనకాపల్లిలో ఫ్లవర్ షో, క్రాకర్స్ షో, సంగీత విభావరి సహా కార్నివాల్‌నూ ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. గజ ఈతగాళ్లను కూడా తీరంలో సిద్ధంగా ఉంచుతున్నామన్నారు.

## దేవరపల్లిలో ఉపాధి కూలీలతో పెద్ద ఎత్తున ఆందోళన



**దేవరపల్లి, పతాకం న్యూస్:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దు నేపథ్యంలో రాష్ట్రంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో అదనపు పని దినాలు,బడ్జెట్ పై ఆశలు అడుగంటాను న్నాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి డి వెంకన్న పేర్కొన్నారు గురువారం దేవరాపల్లి లో ఉపాధి కూలిలతో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు అనంతరం అయిన మాట్లాడారు కూలీలకు ఉపాధి అవ కాశాలు పూర్తిగా తగ్గి పోనున్నాయని అందోన వ్యక్తం చేసారు మరో వైపు వీబీ జీ రామ్ జీ'చట్టం పై నోటి ఫికేషన్ జారీ అయిన ఆరునెలల్లోపు అన్ని రాష్ట్రాల్లో చట్టాన్ని వర్తింప జేసుకోవాల్సి ఉండగా మన రాష్ట్ర ప్రభుత్వం దీనిని వ్యతి రేకించక పోగ కేంద్ర ప్రభుత్వ పై నోరు మెదపడం లెదన్నారు ఈ నేపథ్యంలో కొత్త పథకం అమలు పైనా అనిశ్చితి నెల కుందని తెలిపారు 2022-23, 2023-24, 2024-25 సంవత్సరాల్లో దాదాపు 12 కోట్ల చోప్పున పనిదినాలను కేటాయించిన కేంద్రం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26)లో ఆ సంఖ్యను 7.5 కోట్లకు పరిమితం చేసిందని తెలిపారు దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని సంప్ర దించగా.ఈ పని దినాలను బడ్జెట్ నం 2026 జనవరి నాటికి పూర్తి చేస్తే మరో 5 కోట్ల పని దినాలతోపాటు అదనంగా బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు దీంతో రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్ నుంచి పనుల ప్రారంభించిందన్నారు.ఇంత వరకు 5.6 కోట్ల పని దినాలు ప్రారంభిం,చిందని తెలిపారు ఇంత వరకు 5.6 కోట్ల పని దినాలు పూర్తికాగా మరో 1.9 కోట్ల పనిదినాలు, రూ.1,001.90 కోట్ల లేబర్ బడ్జెట్ మిగి లాయని తెలిపారు.ఈ పని దినాలు, బడ్జెట్ ను జనవరిలో విని యోగించే ప్రయత్నాల్లో ఉందన్నారు.ఈనే పథ్యంలో కేంద్రం ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి దాని స్థానంలో వీబీజీ రామ్ జీ'ని తీసుకొచ్చిందని అన్నారు వచ్చే ఏప్రిల్ నుంచి అది అమల్లోకి తేవాలని నిర్ణ యించడం రాష్ట్రాలకు పెను బారం పడుతుందని తెలిపారు కొత్త చట్టం నేపథ్యంలో రాష్ట్రం ఈ ఆర్థిక సంవత్సరం కింద ఆశించిన 5 కోట్ల పని దినాలను, రూ.వెయ్యి కోట్ల మేర బడ్జెట్ వచ్చే అవకాశాన్ని కోల్పోయిందని అన్నారు.ఇది వచ్చే రెండు నెలల్లో ఉపాధి, అభివృద్ధి పనులపై ప్రభావం చూప నుందని తెలిపారు.వచ్చే ఏప్రిల్ నుంచి వీబీ జీ రామ్ జీ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలంటే ప్రభుత్వం ఆమోదించి సొంత మార్గదర్శ కాలను రూపొందించు కోవాలని. మార్చి లోపు శాసన సభలో దీన్ని ఆమోదించి, ఆ తీర్మానాన్ని కేంద్రానికి పంపిస్తే ఆ తర్వాత ఇది అమల్లోకి వస్తుందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వీబీ జీ రామ్ జీ పథకాన్ని వ్యతిరేకిస్తు ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా అమలుచేయాలని శాసనసభ, మండలిలో తీర్మానంచేసి కేంద్రానికి పంపించాలని డిమాండ్ చేసారు వీబీ జీ రామ్ జీ పథకం రాష్ట్రంలో చట్టాన్ని అమలు చేయని పక్షంలో కేంద్రం నుంచి నిధులు రావని ఆ ఆభారం ఏడాదికి దాదాపు రూ.10 వేల కోట్ల మేర రాష్ట్రం పైనే పడుతుందని తెలిపారు దీన్ని కూలీలు ఐక్యమత్యంగా అడ్డు కోవాలని పాత పద్దతిలో మహత్మగాంది జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కోన సాగించాలని ప్రతి కుటుంబానికి రెండు వందలు రోజులు పని ఆరు వందలు కూలి ఇవ్వాలని వి బి జీ రామ్ జీ పదకాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు ఈకార్యక్రమంలో కె,పైడితల్లిమ్మ యు ,కోండమ్మ సూరిబాబు వరలక్ష్మి సూరమ్మ తోపాటు అదిక సంఖ్యలో కూలీలు పాల్గోన్నారు

## స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన స్పీకర్ అయ్యన్న



**గొలుగొండ, పతాకం న్యూస్:** గొలుగొండ మండలంలో స్వచ్ఛతకు ప్రోత్సాహం ఇవ్వడానికి స్వచ్ఛ రథాన్ని గౌరవ స్పీకర్ అయ్యన్న గురువారం ఏ ఎల్ పురం గ్రామంలో కాలేజ్ గ్రౌండ్లో ప్రారంభించారు ఈ రథం ఫిబ్రవరి 1, 2026 నుండి మండలంలోని ప్రతి పంచాయతీని సందర్శించ నుంది దీనికి సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని అధికారులు తెలిపారు గ్రామాల్లో మహిళలు తమ ఇళ్లలో వాడిన ప్లాస్టిక్, పేపర్లు, ఇనుము వంటి పొడి చెత్తను స్వచ్ఛ రథానికి అందజేస్తే, బదులుగా గృహోపకరణాలు అందజేస్తామని తెలిపారు మండలాన్ని చెత్త రహితంగా మార్చడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఎంపీడీఓ శ్రీనివాస్ పేర్కొంటూ ప్రజలందరూ సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో గొలుగొండ ఎంపీపీ గజ్జెల మణికుమారి, సర్పంచ్ సుజాత,తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు చిటికెలు వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు

## ఐటీ సంబంధిత పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములను పరిశీలించిన ఆర్ఎంజడ్ కార్పొరేషన్ ప్రతినిధులు



**విశాఖపట్నం, పతాకం న్యూస్ :** బెంగళూరుకు చెందిన ఆర్ఎంజడ్ కార్పొరేషన్ ప్రతినిధులు విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో ఐటీ సంబంధిత పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములను పరిశీలించారు. రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ఏపీఐఐసీ అధికారులు వారికి భూములు చూపించారు. రాబోయే ఐదారేళ్లలో ఏపీలో రూ.83 వేల కోట్ల పెట్టుబడులు పెడతామని ఇటీవల దావోస్‌లో జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో ఆర్ఎంజడ్ గ్రూపు ఒప్పందం చేసుకుంది. అందులో భాగంగా విశాఖపట్నంలో ఒక గిగావాట్ సామర్థ్యం కలిగిన డేటా సెంటర్, 50 ఎకరాల్లో గ్లోబల్ కేపబులిటీ సెంటర్ తొలుత ఏర్పాటు చేస్తామని ప్రభుత్వానికి తెలిపింది. వాటికి అవసరమైన భూములు చూసుకోవడానికి ఆర్ఎండీ ఇన్‌ఫ్రా ప్రెసిడెంట్ దీపక్ ఛాబ్రియా, సూపర్‌వైజరీ బోర్డు చైర్ రాజ్ మెండా తదితరులు బుధవారం విశాఖపట్నం వచ్చారు. అధికారుల బృందం వారికి మూడు ప్రాంతాల్లో భూములు చూపించింది. విజయనగరంలో ఒకచోట, విశాఖ జిల్లా ఆనందపురం మండలం జగన్నాథపురం, విశాఖపట్నం నగర శివార్లలోని కాపులుప్పాడ ఐటీ లేఅవుట్‌లో భూములను చూపించారు. త్వరలోనే ఎక్కడ? ఎంతెంత? భూములు కేటాయించేదీ తెలుస్తుందని అధికార వర్గాలు తెలిపాయి.

## గిరిజన సంఘం చొరవతో అడపవలస గ్రామంలో మంచినీటి సరఫరా పునఃప్రారంభం

**డుంబ్రిగూడ, పతాకం న్యూస్:** మండల కేంద్రంలోని సాగర పంచాయతీ, అడపవలస గ్రామంలో మంచినీటి ట్యాంక్‌లో అమర్చిన గేట్ వాల్వ్, నిప్పల్ యూనియన్ పాడైపోవడంతో గత మూడు వారాలుగా గ్రామంలో మంచినీరు సరఫరా ఆగిపోయింది.



దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.ఈ విషయం తెలుసుకున్న ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ చొరవ తీసుకున్నారు. సంబంధిత పంచాయతీ సెక్రటరీకి పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో, గ్రామస్తులు స్వయంగా ముందుకు వచ్చారు. గ్రామస్తులు ఇంటింటికీ రూ.50 నుంచి రూ.100 వరకు చందా వసూలు చేసి సహకరించారు. ఈ నిధులతో పాడైపోయిన గేట్ వాల్వ్, నిప్పల్ యూనియన్ మరమ్మతులు చేపట్టారు. దీంతో మంచినీరు సరఫరా పునఃప్రారంభమైంది. ఈ విజయంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టి. నూకరాజు, చి. రామూర్తి, చి. రమేష్, జి. రామన్న, వి. గోపాలచంద్ర, కె. రాజేశ్, బి. నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఊరూరా అనకాపల్లి ఉత్సవ్ ప్రచారం...



**గొలుగొండ, పతాకం న్యూస్:** అనకాపల్లి ఉత్సవ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎంపీ డీవో యు.ఎస్.వి. శ్రీనివాసరావు ప్రత్యేక పోస్టర్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30,31 తేధీలలో జరగనున్న అనకాపల్లి ఉత్సవాల విశిష్టతను మరియు ఆ ఉత్సవాల్లో నిర్వహించే కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ వేడుకల వివరాలను అందరికీ చేరవేసేందుకే ఈ అవగాహన పోస్టర్ రూపొందించినట్లు తెలిపారు. గ్రామస్థులు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి అనకాపల్లి సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

## శ్రీ తలుపులమ్మ తల్లి అన్నసమారాధనకు రూ.1.25 లక్షల విరాళం : కంబాల శ్రీనివాసరావు



**కోపవరం, పతాకం న్యూస్ :** మండల కేంద్రంలోని కోరుకొండ గ్రామం సమీపంలోని దేవుని కొన్నేరు వద్ద ఉన్న ప్రసిద్ధ శ్రీ తలుపులమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా ఈ నెల 21వ తేదీన ఆలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు రూ.1,25,000 లక్ష ఇరవై ఐదు వేలు విరాళం ప్రకటించారు. ఆ విరాళాన్ని రాత్రి కమిటీ సభ్యులకు శ్రీనివాసరావు నేరుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఈ విరాళం ద్వారా అన్నసమారాధన వంటి ధార్మిక కార్యక్రమాలకు మద్దతు ఇచ్చినందుకు కంబాల శ్రీనివాసరావును ఆలయ కమిటీ, భక్తులు అభినందించారు. ఇలాంటి సేవలు సమాజంలో భక్తి, ధర్మ పరిరక్షణకు ఉదాహరణగా నిలుస్తాయని అందరూ అభిప్రాయపడ్డారు. శ్రీ తలుపులమ్మ తల్లి ఆలయం తూర్పుగోదావరి జిల్లాలోని రాజానగరం నియోజకవర్గం పరిధిలో ఉంది. ఈ జాతర సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

## దారమఠం ఆలయ అభివృద్ధికి నా శక్తివంచన లేకుండా కృషి చేస్తా : చింతకాయల విజయ్



**గొలుగొండ, పతాకం న్యూస్ :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ గొలుగొండ మండలం పాతమల్లంపేట శివారు దారమఠం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ ఉమాదార మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కేరళ నుంచి వచ్చిన ప్రత్యేక ప్రతినిధుల బృందంతో కలిసి ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దారమఠం ప్రాంత విశిష్టతను మరియు ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను కేరళ బృందానికి ఆయన స్వయంగా వివరించారు. అనంతరం విజయ్ మాట్లాడుతూ ప్రకృతి ఒడిలో వెలసిన దారమఠం ఆలయాన్ని పర్యాటక పరంగా ఆధ్యాత్మిక పరంగా మరింత అభివృద్ధి చేసేందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ అధికారులు గట్టి భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్, మండల టీడీపీ నాయకులు గెడ్డం ఆనంద్, పాతమల్లంపేట నీటి సంఘం అధ్యక్షులు గెడ్డం నానాజీ, గొలుగొండ మాజీ సర్పంచ్ పారుపల్లి నాగేశ్వరరావు మరియు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: అచ్చెన్నాయుడు



**విజయవాడ, పతాకం న్యూస్ ::** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య (ఆఫ్ కాఫ్) నూతన చైర్మన్ యాటగిరి రాంప్రసాద్ మాట్లాడుతూ.. మత్స్యకార గ్రామాల్లో పర్యటించి, వారి సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కుల, మతాలకు అతీతంగా కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించే వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై, ముఖ్యంగా మత్స్యకార సామాజిక వర్గం ఎదుర్కొన్న సమస్యలపై అనేక పోరాటాలను చేసానన్నారు. అధిష్టానం, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, సవిత సూచనల మేరకు, సమైక్య 13 జిల్లాల మత్స్యకార సంఘాల మద్దతుతో మత్స్య సహకార సంఘాల సమైక్య చైర్మన్‌గా ఏకగ్రీవంగా తనను ఎన్నుకోవడం జరిగిందన్నారు. స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రం లో గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య (ఆఫ్ కాఫ్) చైర్మన్, పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. ప్రతి మత్స్యకారుడిని ఒక పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రతి మత్స్యకారుడు పారిశ్రామికవేత్త గా ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్రానికి అతిపెద్ద తీర ప్రాంతం ఉందని అత్యంత ఎక్కువ నీటి వనరులు ఉన్నాయని. అటువంటి ఆఫ్ కాఫ్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై, ఈరోజు ప్రమాణ స్వీకారం చేస్తున్నటువంటి చైర్మన్ యాటగిరి రాంప్రసాద్, ఉపాధ్యక్షులు బి. రంగారావు లు అభినందనీయులన్నారు.

## గొలుగొండలో ఉపాధి పనులపై ప్రజా వేదిక ...

**గొలుగొండ, పతాకం న్యూస్ :** గొలుగొండ మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం జాతీయ ఉపాధి హామీ పథకం ( ప్రస్తుత వికసిత్ భారత్ - గ్రామీణ రోజ్‌గార్ మిషన్ ) సామాజిక తనిఖీ 'ప్రజా వేదిక' కార్యక్రమం అత్యంత పారదర్శ కంగా జరిగింది. అనకాపల్లి జిల్లా డ్వామా పీడీ పూరిమ్మ దేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులపై కూలంకషంగా సమీక్ష నిర్వహించారు. ?ఈ సందర్భంగా పీడీ పూరిమ్మ దేవి మాట్లాడుతూ గత ఏడాది కాలంలో మండలంలోని వివిధ శాఖల సమన్వయంతో సుమారు 23 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు జరిగినట్లు వెల్లడించారు.

# పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లు బహుకరించిన టీడీపీ నేత



**గొలుగొండ, పతాకం న్యూస్ :** గొలుగొండ మండలం కొత్త మల్లంపేట ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల నిమిత్తం టీడీపీ గ్రామ అధ్యక్షుడు పైలా లోవరాజు పెన్నులు, రైటింగ్ ప్యాడ్‌లను బహుకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును కోరుకుంటూ ఈ చిన్నపాటి సాయం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## మినీ అంగన్వాడీ కార్యకర్తలుగా నిధులు నిర్వహిస్తూ ప్రొమోషన్ పొందిన అంగన్వాడీ టీచర్లు



**అనంతగిరి, పతాకర్ న్యూస్ :** అనంతగిరి యూనియన్ నాయకులు జి.కళవతి, పి.మం జుల తదితరులను శాలువా కప్పి సన్మానం చేసిన టీచర్లు గౌరవ అతిథులుగా పాల్గొన్న అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు ప్రొమోషన్ పొందిన జన్ని గౌరి, పిల్లి శైలాజ, కె.లక్ష్మి, జి పైడ్డితలమ్మ అంగన్వాడీ టీచర్లను జడ్పిటిసి అభినందించారు.ఈ సందర్భంగా జడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ అనంతగిరి మండలంలో 105 మంది మినీ అంగన్వాడీ కార్యకర్తలు నిధులు నిర్వహిస్తుండగా అంగన్వాడీ కార్యకర్తల పోరాట ఫలితంగా అనంతగిరి మండలంలో 25 మంది మినీ అంగన్వాడీలు ప్రొమోషన్ పొందిన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 42 రోజులుగా పోరాటం చేసిన కారణంగానే మినీ అంగన్వాడీలు, మెయిన్ అంగన్వాడీలు అయ్యారు గ్రాడివీటి, దహన సంస్కార మట్టి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి రాయితీలు పోరాట ఫలితంగానే వచ్చాయి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సెక్టార్ వైజ్ యూనియన్ నాయకులు కె.పార్వతి, సుబ్బలక్ష్మి, ఎస్.లక్ష్మి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అజిత్ పవర్ మరణం తీరని లోటు: ప్రసాద్ నాయుడు

**మాకవారిపాలెం, పతాకం న్యూస్ :** అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం బూరుగుపాలెం గ్రామస్తుడైనటువంటి పోతల ప్రసాద్ నాయుడు తమతో ప్రయా ణించిన మహారాష్ట్ర రాజకీయ నాయకుడు అజిత్ పవార్ అకస్మాత్తు విమాన ప్రమాదంలో మరణించిన వార్తపై జ్యోతి రావు పూలే ఓబీసీ జాతీయ అధ్యక్షుడు పోతల ప్రసాద్ నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ఈ ఘటన ఆయనకు ఎంతో బాధాకరమని, భర్తీ చేయలేని లోటుగా భావిస్తూ కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు. అజిత్ పవార్ మహారాష్ట్ర రాజకీయాల్లో బలమైన సంబంధాలు, రీతులు ఏర్పరచుకున్నవారని,యువత అభివృద్ధి కోసం అలసిపోకుండా కృషి చేసినవారని పోతల ప్రసాద్ నాయుడు గుర్తుచేశారు. ఆయన అచంచలమైన విరామం మనలో సృష్టించిన శూన్యతను నింపడం కష్టమని, ఇది కుటుంబం, ఎన్సీపీ కార్యకర్తలు, మొత్తం మహారాష్ట్రకు తీరని నష్టమని పేర్కొన్నారు. ఈ దుఃఖ సమయంలో ఆయన ఆత్మకు శాంతి కలగాలని, బంధువులకు ఈ వేదనను భరించే శక్తి ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. పోతల ప్రసాద్ నాయుడు తన లేఖ ద్వారా ఈ శోక సందేశాన్ని పంపినట్లు తెలిసింది.




## కందుకూరి ఆశయాలకు తూట్లు పొడిస్తే ఊరుకోము : ఎస్ఎఫ్ఐ



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** గురువారం కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలను ఎస్.ఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ మాట్లాడుతూ కందుకూరి ఆశయాలకు తట్లు పొడిచేలా ఉన్న హితకారిణి సమాజం వైఖరిని కండిస్తున్నామని, గత కొన్ని రోజులుగా కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల విద్యార్థులు తమ హాస్టల్ సమస్య పైన పోరాటం చేస్తున్నారని అన్నారు. స్థానికంగా ఉన్న హితకారిణి సమాజం పాలక మండలి చైర్మన్ కళాశాల లోపల ఉన్న హాస్టల్ ను స్వాదీనం చేసుకొని వారు నడుపుతున్నారు అని, ఎండోమెంట్ కమిషనర్ నుంచి హాస్టల్ ను కళాశాలకు అప్ప చెప్పమని ఉత్తర్వులు పంపిన అప్ప చెప్పకుండా వాల్లే నడుపుతున్నారు. దీనిని ఎస్ఎఫ్ఐ గా పూర్తిగా వ్యతిరికిస్తునాం అని తెలిపారు. జీవో నెంబర్ 42 ప్రకారం రాజమండ్రిలో ఉన్న కందుకూరి విద్యాసంస్థలని దాని ఆస్తులని ప్రభుత్వనికి అప్పచెప్పారు. కానీ రాజమండ్రిలో ఉన్న హితకారిణి సమాజం, ఎండోమెంట్ స్థానికంగా ఉన్న ప్రముఖుల సహాయంతో ఈ ఆస్తులను కాజేయాలి అని చుస్తునారు. దీనికి రాజమండ్రి లో ఉన్న పోలీస్ శాఖ మద్దతుగా తెలియజేస్తుంటే కూటమి ప్రభుత్వం ఎం చేస్తుందని ప్రశ్నించారు.

# 'డిగ్రీ కళాశాల' లో జాతీయ ఓటరు అవగాహన పాదయాత్ర విజయవంతం




**అరకులోయ, పతాకం న్యూస్:** జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కేంద్ర యువజన వ్యవహారాలు ఁ క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని మై భారత్ కార్యక్రమం ఆధ్వర్యంలో విజయవంతమైన పాదయాత్ర నిర్వహించబడింది. మండల కేంద్రంలోని కర్సలగుడ, పాణి రంగిని ప్రాంతాల్లో ఈ పాదయాత్రలు జరిగి, స్థానిక ప్రజల్లో ఓటు హక్కు పట్ల అవగాహన కల్పించాయి.మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి. మహేశ్వరరావు ఆదేశాల మేరకు విద్యార్థులు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకులు పి. నాగబాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ఒక వజ్రాయుధమని,సక్రమ మార్గంలో ఓటును వినియోగించుకొని మంచి పాలకులను ఎన్నుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అని తెలిపారు.ఈ పాదయాత్ర యొక్క ప్రధాన ఉద్దేశ్యం ప్రజాస్వామ్య ప్రక్రియలో యువత భాగస్వామ్యాన్ని గరిష్ఠంగా పెంచడమే అని ఎన్ఎస్ఎస్ సభ్యులైన వై. విజయలక్ష్మి, ఎం. అనిత కుమారి, కె. బాలరాజు వివరించారు. దేశవ్యాప్త యువత సమీకరణలో భాగంగా, ముఖ్యంగా మొదటిసారి ఓటు వేసేవారిపై దృష్టి సారించి, ఓటు వేయడం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పిస్తున్నట్లు వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సి.హెచ్. మురళీకృష్ణతో పాటు యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎర్ర చెరువును ఆధునికీకరిస్తాం



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** మేజర్ పంచాయతీ పాతపట్నంలోని ఎర్ర చెరువుకు ఆధునిక రూపాన్నిచ్చేందుకే చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఈ మేరకు పాతపట్నంలోని ఎర్ర చెరువుపై జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎర్ర చెరువు చుట్టూ వాకింగ్ ట్రాగ్, పార్కు ఏర్పాటు చేయిస్తామన్నారు. దీంతో ఆహ్లాదకర వాతావరణం నెలకొన డంతో పర్యావరణ పరిరక్షణకూ తోడ్పడుతుందన్నారు. త్వరితగతిన ఈ పనులు పూర్తి చేయిస్తున్నట్టు తెలిపారు. పీఆర్‌డీఈఈ ఎ.చంద్రినాయుడు, ట్రాన్స్‌కో ఏడీఈ ప్రసాదరావు, టీడీపీ నాయకులు పైల బాబ్జీ, పెద్దింటి శ్రీను, సిర్ల జోగారావు, కె.కర్రెన్న, కలమట భుజంగరావు తదితరులు ఉన్నారు. అలాగే తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి, అర్జీదారులను వినతులు స్వీకరించారు.

## క్వారీ లీజులను వినియోగించుకోండి



**టెక్కలి, పతాకం న్యూస్:** నీలిరంగు గ్రానైట్ క్వారీల లీజు అవ కాశాలను సద్వినియోగం చేసుకోవాలని గనులశాఖ సహాయ సంచాలకులు విజయలక్ష్మి అన్నారు. ఆసక్తి గల గ్రానైట్ లీజుదారులతో నిర్వ హించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏపీఎండీసీకి చెందిన గ్రానైట్ క్వారీ లీజు అనుమతులపై ఆమె పలువురికి అవగాహన కల్పించారు. క్వారీ లీజులు పొందాలంటే ఎలా దరఖాస్తులు చేసుకోవాలని వివరించారు. మైన్స్ డీడీ కార్యా లయ ఏజీ ఆర్.కుమార్‌నాయుడు, ఏపీఎండీసీ సహాయ ప్రాజెక్ట్ అధికారి దీన్ పాల్, మైన్స్ కార్యాలయ ఏజీ రాము, ఆర్ఐ గణేష్, పలు గ్రానైట్ క్వారీల నిర్వా హకులు, లీజు కోసం దరఖాస్తు చేసుకునేందుకు పలువురు హాజరయ్యారు.

## హాకర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి




**విజయవాడ, పతాకం న్యూస్:** మున్సిపల్ అధికార్ల, పోలీస్ల వేధింపులు ఆపాలి.అర్హులైన వారందరికీ బ్యాంకుల ద్వారా ముద్ర రుణాలను మంజూరు చేయాలి. హాకర్లందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలి. ఇల్లు, ఇళ్ళ స్థలాలు ఇవ్వాలి.వ్యాపార కూడళ్ళలో టాయిలెట్స్ సౌకర్యం కల్పించాలి. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దోనేపూడి.కాశీనాథ్ మాట్లాడుతూ హకర్స్ మరియు తోపుడు బండ్ల మీద వ్యాపారం చేస్తున్న కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, వడ్డీ లేని ఋణాలు ఇవ్వాలని, పోలీస్, మున్సిపల్ అధికారుల వేధింపులు ఆపాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని 11 కేంద్ర కార్మిక సంఘాలు,ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి.కావున ఈ సమ్మెలో చిరువ్యాపారాలు చేసుకునే హాకర్లందరూ వ్యాపారం బంద్ చేసి పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సమ్మె రోజు జరిగే ప్రదర్శన -- సభలను జయప్రదం చేయాలని హాకర్స్ ఁ తోపుడు బండ్ల యూనియన్ (సిఐటియు) పిలుపునిస్తున్నది. కేంద్రంలోని మూడోసారి అధికారులకు వచ్చిన బిజెపి ప్రభుత్వం మరింత దూకుడుగా వ్యవహరిస్తుంది. కార్మిక వర్గం అనేక త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలు రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి కార్మికుల్ని కట్టు బానిసలుగా చేస్తుంది.ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ వంటి ప్రజలకు నష్టం చేసే అనేక విధానాలను అమలు చేసి దేశాన్ని ఆర్థికంగా దెబ్బ తీసిందన్నారు.

## ఏసీబీకి చిక్కిన ఏబీసీడబ్ల్యూవో



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** శ్రీకాకుళం జిల్లా సహాయ బీసీ బాలుర సంక్షేమ వసతి గృహ అధికారి (ఏబీసీడబ్ల్యూవో) జి.బాలముకుందరావు వార్డెన్ల నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఏసీబీ ఇన్‌చార్జి డీఎస్పీ రమణమూర్తి, సీఐ కె.భాస్కర్ వెల్లడించిన వివరాల మేరకు.. నరసన్నపేటలో ఏబీసీడబ్ల్యూవోగా పనిచేస్తున్న బాలముకుందరావు కంచిలి, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లోని వసతి గృహాలకు ఎఫ్ఏసీగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ప్రతి విద్యార్థికీ ఐదు రూపాయల చొప్పున తనకు లంచం ఇవ్వాలని, లేని పక్షంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వార్డెన్లను హెచ్చరించారు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో వార్లు ఆ నగదు ఆయనకు ఇచ్చేందుకు కంచిలి బీసీ వసతి గృహం వద్ద సమావేశం అయ్యారు. ఈ సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి, వార్డెన్లు సిద్ధం చేసిన రూ.1,84,070 స్వాధీనం చేసుకున్నారు. ఏబీసీడబ్ల్యూవోపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్టు ఏసీబీ ఇన్‌చార్జి డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

## మాపై చేసిన ఆరోపణలపై కోర్టును ఆశ్రయిస్తాం: వైవీ సుబ్బారెడ్డి



**తాడేపల్లి, పతాకం న్యూస్:** టీటీడీ దేవస్థానానికి సంబంధించి కల్తీ నెయ్యి అంశంపై సుప్రీంకోర్టు నియమించిన సిట్.. నెల్లూరు ఏసీబీ కోర్టులో ఛార్జ్ షీట్ సమర్పించిందని వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఫైనల్ చార్జ్‌షీట్‌లో నెయ్యిలో కల్తీ జరిగిందని, కానీ జంతు కొవ్వు లేదని సిట్ చెప్పిందని ప్రస్తావించారు. వైసీపీ హయాంలో స్వామివారికి సమర్పించే ప్రసాదంలో కూడా నెయ్యికి బదులు యానిమల్ ఫ్యాట్ వాడారని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారని గుర్తుచేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉండే శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినే పరిస్థితి వచ్చిందని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. దేశంలో ఎంతోమంది భక్తులు ఆందోళనకు లోనయ్యారని చెప్పుకొచ్చారు. స్వామి వారి ప్రసాదంలో జంతువు కొవ్వు కలిపారని వస్తున్న వార్తలపై తాను సుప్రీంకోర్టును ఆశ్రయించానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేసే సిట్ విచారణపై తమకు నమ్మకం లేదని.. సుప్రీం కోర్టులో స్వతంత్ర దర్యాప్తు సంస్థల ద్వారా విచారణ జరిపించాలని పిటిషన్ వేశానని ప్రస్తావించారు.

'విచారణ రిపోర్టు రాకుండానే రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నవారు మాట్లాడటం సరికాదని సుప్రీంకోర్టు కూడా చెప్పింది. తిరుపతి లడ్డూ విషయం ఎంతోమంది భక్తుల మనోభావాలకు సంబంధించింది. 2024 జూలైలో సప్లై చేసిన నెయ్యిలో కల్తీ జరిగిందా లేదా అనే విషయం నిర్ధారణ చేయాలని సిట్ వేశారు. ఆ నెయ్యిని స్వామివారి ప్రసాదంలో వాడారో లేదో తేల్చాలని సిట్ వేశారు. నెయ్యిలో కల్తీ జరిగింది, కానీ జంతువు కొవ్వు కలవలేదని స్పష్టంగా సిట్ చెప్పింది. వైసీపీ హయాంలో జూలైలో నాలుగు ట్యాంకర్లు వస్తే వాటిలో కూడా జంతువుల కొవ్వు కలవలేదని తేల్చి చెప్పారు. ఆ నాలుగు ట్యాంకర్ల నెయ్యిని సైతం వేరే రూపంలో టీటీడీకి సప్లై చేసి లడ్డూ తయారీలో వాడారు. నాపై, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేశారు. మాపై చేసిన ఆరోపణలపై కోర్టును ఆశ్రయిస్తాం' అని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

## అతివేగం అదుపుతప్పి ఇటుకల వ్యాను బోల్తా

**చింతపల్లి, పతాకం న్యూస్:** చింతపల్లి మండలం వివరాలు ఇలా ఉన్నాయి కృష్ణాపురం గ్రామంలో అతి వేగంగా వెళుతూ అదుపుతప్పి బోల్తాపడ్డ ఇటుకల వ్యాను ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ బోడకొండ (40) తీవ్ర గాయాలకు గురయ్యాడు. స్థానికులు గుర్తించి అంబులెన్స్ సహాయంతో చింతపల్లి ప్రాథమిక ఏరియా హాస్పిటల్‌కి తరలించారు. వ్యాను రోడ్డు సైడ్‌లో ఉన్న మొక్క జొన్నపొత్తుల దుకాణం లోకి దూసుకొని వెళ్లింది అని స్థానికులు తెలియజేశారు.

# నిషేధిత భూముల్లో ఎంఎస్ఎంఇ పార్కులు!




**ఒంగోలు, పతాకం న్యూస్:** ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఇ పార్కులన్నీ నిషేధిత భూముల్లోనే ఉన్నాయి. ఇవన్నీ 22-ఎ కింద ఉండడంతో ఈ భూముల్లో పరిశ్రమలు పెట్టడానికి వీల్లేదు. అంటే, ఇవన్నీ ఏదో కారణంతో వివాదాల్లో ఉన్నాయి. వీటిని సజావుగా పరిశీలన చేయకుండా అధికారులు కోట్ల రూపాయల్లో ఖర్చు పెట్టి ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటు పేరుతో మౌలిక సదుపాయాలు కల్పించారు. తీరా పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తే, అవన్నీ నిషేధిత భూముల్లో ఉన్నట్లు తేలింది. ఇక్కడ పరిశ్రమలు పెట్టడానికి ఏ అనుమతులూ రావు. దీంతో, ఈ భూములను నిషేధిత జాబితాల నుంచి తొలగించేందుకు ఎపిఐఐసి అధికారులు రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది అంతసులువు కాదు. జిల్లాలో సగం భూ సమస్యలు ఇవే. 'జిల్లాలో ఖాళీగానే ఎంఎస్ఎంఇ పార్కులు' శీర్షికన 'ప్రజాశక్తి'లో ఈ నెల 24న వచ్చిన కథనానికి స్పందించి ఎపిఐఐసి అధికారులు వివరణ ఇస్తూ, అన్నీ పార్కులూ నిషేధిత భూముల్లో ఉన్నాయని తెలిపారు. అందువల్లే అవి ఖాళీగా ఉన్నాయని వివరణ ఇచ్చారు. వీటిని నిషేధిత భూముల నుంచి విడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎపిఐఐసి జోనల్ మేనేజర్ తెలిపారు. ఆశ్చర్యమేమిటంటే ఇటీవల సిఎం చంద్రబాబు పిసి పల్లి వద్ద ప్రారంభించిన పార్కు కూడా నిషేధిత భూముల్లోనే ఉంది. సిఎం స్థాయిలో ఎంఎస్ఎంఇ పార్కును ప్రారంభించే తరుణంలో అక్కడి భూమి ఎలాంటి స్వభావం కలిగి ఉంది? రెవెన్యూపరమైన వివాదాలున్నాయా? పేచీలున్నాయా? అనేవి పరిశీలన చేయాల్సిన అవసరం అధికారులపై ఉంది. ఇవేవీ పరిశీలించకుండా ఎంఎస్ఎంఇ పార్కుకు నిషేధిత భూములు కేటాయించడం వారి నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోంది. కందుకూరు-పామూరు రహదారిలో మాలకొండాపురం వద్ద 55.48 ఎకరాల్లో 356 ప్లాట్లు వేశారు. రోడ్లు, డ్రెయిన్లు, కరెంటు సౌకర్యాలు ఇక్కడ పరిశ్రమలు పెట్టేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు కేటాయింపులు కూడా చేశారు. అయితే, ఈ భూములు నిషేధిత జాబితాలో ఉన్నందున అందరూ రద్దు చేసుకున్నారు. దీనికి సమీపంలో ఇటీవల పిసి పల్లి మండలం పెద ఇర్లపాడు వద్ద 22.13 ఎకరాల్లో మరో పార్కును ఏర్పాటు చేశారు. 98 ప్లాట్లు వేశారు. దీనిని సిఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయి. దొనకొండ వద్ద 43.79 ఎకరాల్లో రాగమక్కపల్లి పార్కు ఏర్పాటు చేశారు. 270 ప్లాట్లు వేశారు. ఇక్కడా విద్యుత్తు, రోడ్లు, డ్రెయిన్లు ఏర్పాటు చేశారు. ఈ భూములు కూడా నిషేధిత జాబితాలో ఉన్నందున పరిశ్రమలు పెట్టడానికి వీల్లేకుండా పోయింది. దర్శి మండలం చందలూరు వద్ద 50 ఎకరాల్లో 50 ప్లాట్లు అభివృద్ధి చేశారు. ఇక్కడా అదే సమస్య. తర్లుబాడు మండలం కలుజువ్వలపాడు పరిధిలో ఇటీవల పార్కును అభివృద్ధి చేశారు.

19.76 ఎకరాల్లో 50 ప్లాట్లు వేశారు. ఇది మార్కాపురం-ఒంగోలు ప్రధాన రహదారి పక్కనే ఉంది. ఈ భూములు కూడా నిషేధిత జాబితాలో ఉన్నందున పారిశ్రామికవేత్తలు ఎవరూ ప్లాట్లు కోసం దరఖాస్తు చేసుకోలేదని ఎపిఐఐసి అధికారులు చెబుతున్నారు. ఎంఎస్ఎంఇ పార్కులు నియోజకవర్గానికి ఒకటి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అధికారులపై ఒత్తిళ్లు రావడంతో ఎక్కడ ఖాళీగా ఉంటే ఆ భూములను కేటాయించి మౌలిక సదుపాయాల పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. అన్ని పార్కులూ నిషేధిత భూములో ఉండడంతో పరిశ్రమల ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పుడే వివాదాలు ఉన్నందున భవిష్యత్తులోనూ ఇవి వెంటాడుతాయని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఈ పార్కుల్లో పరిశ్రమలు పెట్టడానికి ముందుకు రావడం లేదు. వీటిని నిషేధిత భూముల జాబితా నుంచి తప్పించాలని కోరుతున్నారు.

## రూ.132 కోట్లతో జింకానా మాతా శిశు సంరక్షణ భవనం.. 30న చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం




**గుంటూరు, పతాకం న్యూస్:** చదువుతోపాటు, జీవిత పాఠాలు నేర్పిన చదువుల గుడికి తోచిన సాయం చెయ్యడంలో ఎంతో సంతృప్తి ఉందంటారు కొందరు. అలాంటి వారే మన జీఎంసీలో చదివిన వాళ్లు కూడా. 'గుంటూరు మెడికల్ కాలేజీ అలూమ్ని ఆఫ్ నార్త్ అమెరికా'నే జింకానా అంటుంటారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల (జీఎంసీ)లో చదువుకుని అమెరికాలో స్థిరపడిన వారంతా 45 ఏళ్లుగా తమ కాలేజీతోపాటు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్) అభివృద్ధికి కృషి చేస్తున్నారు. అతి తక్కువ మందితో 1981లో ప్రారంభమైన ఈ జింకానా సంఘంలో సంఖ్య పెరుగుతూ ఇప్పుడు 2 వేల మందికి పైగా సభ్యులున్నారు. జీఎంసీ కోసం తరుచూ విరాళాలు ఇస్తూ ఆధునిక వసతి సౌకర్యాలు కల్పిస్తూ, శాశ్వత భవనాలను నిర్మాణాలు చేయిస్తున్నారు. ఇక్కడి వైద్య విద్యార్థులకు ముఖ్యమైన, అవసరమైన మేధో పరిజ్ఞానం, శిక్షణలను అందించడంలోనూ సహకరిస్తూ వారికి అండగా ఉంటున్నారు. అంతే కాకుండా ఇప్పటికే వారంతా కలిసి పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు తమవంతు సాయం చేస్తూ రూ.150 కోట్లకు పైగా వెచ్చించడం విశేషమనే చెప్పొచ్చు.

వైద్య కళాశాలకు ఏదో ఒకలా తమ వంతు సాయం అదించాలని మొదట్లో చిన్నపాటిగా జిరాక్స్ యంత్రాన్ని అందించడంతో మొదలుకుని ఆనాటి నుంచి తమ దాతృత్వాన్ని చాటుకుంటూనే ఉన్నారు జింకానా సభ్యులు. వైద్య విద్యాలయంలో సమావేశాలు, సభలు నిర్వహించేందుకు ఆడిటోరియం నిర్మించేందుకు 2005లో రూ.5 కోట్లు నిధులు సమకూర్చారు. సకల హంగులతో అత్యాధునికంగా దీనిని తీర్చిదిద్దారు. పేదల అవసరాలను దృష్టిలో ఉంచుకుని జీజీహెచ్‌లో 2014లో పొదిల ప్రసాద్ జింకానా సూపర్ స్పెషాలిటీ అండ్ ట్రామా సెంటర్‌ను ఏర్పాటు చేశారు. రూ.35 కోట్లతో ఈ నిర్మాణాన్ని సంకల్పించారు. ఇందులో రూ.5 కోట్లను పొదిల ప్రసాద్ విరాళంగా అందించారు. ప్రస్తుతం ఈ భవనం జీజీహెచ్‌కు 'గుండె'గా మారింది. కొవిడ్ కల్లోల సమయంలో జీజీహెచ్‌కు రూ.కోట్ల విలువైన యంత్రాలు, పరికరాలు సమకూర్చడంలో జింకానా పాత్ర వెలకట్టలేనిదని జీజీహెచ్ ప్రతినిధులు తెలుపుతున్నారు.

గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో మాతాశిశు సంరక్షణ ఏళ్ల తరబడి ఎన్నో ఇబ్బందుల్లో కొనసాగింది. సరైన భవన సదుపాయం లేకపోవడంతో ఒకే పడకపై ఇద్దరు తల్లులు, వారి పిల్లలను పడుకోబెట్టాల్సి పరిస్థితులు తలెత్తేని ఈ దుస్థితిని స్వయంగా చూసి చలించిన కొందరు జింకానా సభ్యులు తల్లీబిడ్డలకు అండగా నిలవాలనుకున్నారు. రూ.100 కోట్లతో సెల్లార్, జీం5 అంతస్తుల్లో 597 పడకలు, అధునాతన సౌకర్యాలతో కానూరి జింకానా మాతా శిశు సంరక్షణ భవన నిర్మాణానికి పూనుకున్నారు. డాక్టర్ గవిని ఉమాదేవి ఒక్కరే తన భర్త డాక్టర్ కానూరి రామచంద్రరావు పేరిట రూ.22 కోట్లు విరాళం ఇచ్చారు. ప్రభుత్వం రూ.27 కోట్ల విలువైన పరికరాలు అందించేందుకు ముందుకొచ్చింది. ఇతర ఖర్చులు కలిపి రూ.132 కోట్లతో భారీ భవనం అందుబాటులోకి వచ్చింది. దీనిని ఈ నెల 30న సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు.

## వేపాడలో వైభవంగా తీర్థమహోత్సవం

**వేపాడ, పతాకం న్యూస్:** వేపాడలో పరదేశమ్మ, ముత్యాలమ్మతల్లి అమ్మవార్ల తీర్థమహోత్సవం వైభవో పేతంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్థులు అమ్మవార్లను ఉదయం ఐదు గంటల నుంచే దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనం తరం నిర్వాహకులు ఏర్పాటుచేసిన ఎడ్ల బండ్ల పరుగు పోటీల్లో వేపాడ, వల్లంపూడి, వీలుపర్తి, దబ్బిరాజుపేట తదితర గ్రామాలకు చెందిన 16 ఎడ్ల బండ్లు పాల్గొనగా మొదటి ఆరుస్థానాల్లో నిలిచిన ఎడ్ల బండి యజ మానులకు నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. అలాగే వన వేపాడ-మన నేస్తం ట్రస్టు సభ్యుల ఆధ్వర్యంలో జూనియర్, సీని యర్ విభాగాల్లో నిర్వహించిన పురుషుల పరుగు పోటీలను 45 మంది పాల్గొన్నారు. ఈమేరకు ఈపోటీల్లో సీనియర్ విభాగంలో బక్కునా యుడుపేటకు చెందిన జి.చంద్రశేఖర్, మార్లాపల్లికి చెందిన ఎం.మహేష్ రెండు, వేపాడకు చెందిన ఎస్.జ్ఞానేష్ మూడోస్థానం సాధించారు. జూనియర్ విభాగంలో వీలుపర్తికి చెందిన కె.లోవరాజు,షన్ముఖి సాయి (గుడివాడ) జి.మధు(వల్లంపూడి) విజయం సాధించారు.



## కార్గిల్ విక్టరీ పార్కు పనులు వేగవంతం చేయాలి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** నగరంలోని జడ్పీ కార్యాలయం ఎదు రుగా ఉన్న హౌసింగ్‌బోర్డు కాలనీలోని కార్గిల్ విక్టరీ పార్కు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. పనులు జరుగుతున్న తీరును స్వయంగా పరిశీలించారు. ప్రతిఒక్కరూ విని యోగించుకునేలా తీర్చిదిద్దాలన్నారు. పార్కులో నిర్మిస్తున్న రెండు బ్యాడ్మింటన్, పికెల్ బాల్, బాక్స్ క్రికెట్ కోర్టులు క్రీడలకు పూర్తిస్థాయిలో వినియో గమవ్వాలన్నారు. యోగా ప్లాట్‌ఫారం (ఓపెన్ ఎయిర్ థియేటర్)ను యోగాకు లేదా స్క్రీన్ ద్వారా సినిమా చూసుకునేలా తయారు చేయాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న లైబ్రరీని కూల్చి, కొత్త భవ నాన్ని నిర్మించామ న్నారు. ఆ భవనానికి పక్కనే ధ్యానం చేసుకు నేలా తీర్చిదిద్దాలన్నారు. కార్గిల్ యుద్ధ చరిత్రను తెలియ జేసేలా తీర్చిదిద్దాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి శైలజకు సూచించారు. వాటర్ ట్యాంకు వద్ద ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో చూపించా లని డీఈని ఆదేశించారు. కార్యక్రమంలో సెవెన్‌హిల్స్ అసోసి యేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణ, మునిసిపల్ డీఈ, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో అభ్యసించాలి




**గుర్ల, పతాకం న్యూస్:** విద్యార్థులు క్రమశిక్షణతో అభ్యసించా లని డీఈవో మాణిక్యంనాయుడు తెలిపారు. పాఠశాలలో మౌలిక సదుపా యాలు పూర్తిస్థాయిలో సమకూర్చాలని చెప్పారు. మండలం లోని మన్యపురిపేట, వల్లాపురం, కెల్ల పాఠశాలలను పరిశీలించారు. బెల్లా నపేట పాఠశాలలో మరుగుదొడ్లు లేవని డీఈవో దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపరిచే విధం గా కృషి చేయాలని సూచించారు. రైజింగ్ స్టార్ విద్యార్థులను షైనింగ్ స్టార్ విద్యార్థులుగా తీసుకురావడానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో భాను ప్రకాష్, మజ్జి శ్రీనివాసరావు ఉన్నారు.

## పంచాయతీలకు సొంతగూడు




**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలో గ్రామ పరిపాలనను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది. చాలాచోట్ల గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేకపోవడం, ఉన్న భవనాలు సైతం శిథిలావస్థకు చేరడంతో ఆయా పంచాయతీల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ పాలకవర్గ సమావేశాలను, రికార్డులను సరిగా నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు అందుబాటులోకి తేవాలని నిర్ణయించి దశల వారీగా నిధులు మంజూరు చేస్తున్నది. సొంత భవనాలు లేని పంచాయతీలకు కొత్త భవనాల నిర్మాణాల కోసం అవసరమైన స్థలాలను గుర్తించే బాధ్యతను రెవెన్యూ అధికారులకు అప్పగించారు. స్థలాలు అందుబాటులో లేని పంచాయతీల్లో స్థల సేకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నచోట నిధులు మంజూరు చేసి, వెంటనే నిర్మాణాలు చేపడుతున్నారు. జిల్లాలో 646 గ్రామ పంచాయతీలు వుండగా వీటిలో 95 పంచాయతీలకు సొంత భవనాలు లేవు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత 26 పంచాయతీలకు సొంత భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. ఉపాధిహామీ పథకం, గ్రామ పంచాయతీల సాధారణ నిధుల నుంచి రూ.35 లక్షల చొప్పున కేటాయిస్తున్నది. ఇప్పటికే ఐదు భవనాల నిర్మాణ పనులు పూర్తికావడంతో అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన భవనాల నిర్మాణ పనులు వివిధ దశల్లో వున్నాయి. ప్రతి భవనంలో ఈవోకు, సర్పంచ్‌కు వేర్వేరుగా గదులు, సమావేశ మందిరం, రికార్డు గది, ప్రజలు వేచివుండే హాల్, మరుగుదొడ్లు వుంటాయి.


## వీధి కుక్కల కేసులో తీర్పుని రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** వీధి కుక్కల కేసులో గతంలోని ఉత్తర్వులను సవరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం తీర్పుని రిజర్వ్ చేసింది. పంజాబ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ మరియు రాజస్థాన్ వంటి రాష్ట్రాలు తీసుకున్న చర్యలను క్లుప్తీకరించి అమీకస్ క్యూరీ గౌరవ్ అగర్వాల్ నివేదికను పరిశీలించిన అనంతరం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం తన నిర్ణయాన్ని రిజర్వ్ చేసింది. ఎన్‌హెచ్ఎఐ తరపు న్యాయవాది వాదనలను కూడా ధర్మాసనం విచారించింది. వీధుల్లో తిరిగే జంతువులను తొలగించాలని, జాతీయ రహదారులు, రోడ్లపై ఫెన్సింగ్ నిర్మించాలని ఎన్‌హెచ్ఎఐ గతేడాది నవంబర్ 7న ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. జంతు సంరక్షణ కేంద్రాలు లేదా జంతు జనన నియంత్రణ సౌకర్యాలకు అనుమతి కోరుతూ ఎన్‌జిఒ దాఖలు చేసిన దరఖాస్తులను త్వరగా పరిశీలించాలని యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఎడబ్ల్యుబిఐ)ని ఆదేశించింది.

# పార్కిన్సన్స్ వ్యాధి లక్షణాలు..

పార్కిన్సన్స్ వ్యాధి అనేది నాడీ వ్యవస్థ యొక్క కదలిక రుగ్మత, ఇది కాలక్రమేణా తీవ్రమవుతుంది. నాడీ వ్యవస్థ అనేది కదలికతో సహా శరీరంలోని అనేక భాగాలను నియంత్రించే నాడీ కణాల నెట్‌వర్క్. లక్షణాలు నెమ్మదిగా ప్రారంభమవుతాయి. మొదటి లక్షణం ఒక చేతిలో లేదా కొన్నిసార్లు పాదం లేదా దవడలో కేవలం గుర్తించదగిన వణుకు కావచ్చు. పార్కిన్సన్స్ వ్యాధిలో వణుకు సాధారణం. కానీ ఈ రుగ్మత దృఢత్వం, కదలిక మందగించడం మరియు సమతుల్యతలో ఇబ్బందిని కూడా కలిగిస్తుంది, ఇది పడిపోయే ప్రమాదాన్ని పెంచుతుంది. పార్కిన్సన్స్ వ్యాధి ప్రారంభ దశలో, మీ ముఖంలో వ్యక్తీకరణ తక్కువగా ఉండవచ్చు లేదా అసలు కనిపించకపోవచ్చు. మీరు నడుస్తున్నప్పుడు మీ చేతులు ఊగకపోవచ్చు. మీ మాటలు మృదువుగా లేదా అస్పష్టంగా మారవచ్చు. కాలక్రమేణా లక్షణాలు తీవ్రమవుతాయి. పార్కిన్సన్స్ వ్యాధిని నయం చేయలేనప్పటికీ, మందులు లక్షణాలు మెరుగుపడటానికి సహాయపడతాయి. కొన్నిసార్లు ఆరోగ్య సంరక్షణ నిపుణులు మెదడులోని భాగాలను నియంత్రించడంలో సహాయపడటానికి శస్త్రచికిత్సను సూచించవచ్చు. ఈ శస్త్రచికిత్స లక్షణాలను తగ్గించడంలో సహాయపడుతుంది. పార్కిన్సన్స్ వ్యాధి లక్షణాలు ప్రతి ఒక్కరికీ భిన్నంగా ఉండవచ్చు. ప్రారంభ లక్షణాలు తేలికపాటివిగా ఉండవచ్చు మరియు మీరు వాటిని గమనించకపోవచ్చు. లక్షణాలు తరచుగా శరీరం యొక్క ఒక వైపున ప్రారంభమవుతాయి, తరువాత రెండు వైపులా ప్రభావితమవుతాయి. లక్షణాలు సాధారణంగా ఒక వైపున మరొక వైపు కంటే అధ్వాన్నంగా ఉంటాయి. కొన్ని పార్కిన్సన్స్ వ్యాధి లక్షణాలు ఇతర రుగ్మతల మాదిరిగానే ఉంటాయి.



వణుకు. ఈ లయబద్ధమైన వణుకు సాధారణంగా చేతులు లేదా వేళ్లలో ప్రారంభమవుతుంది. కొన్నిసార్లు పాదం లేదా దవడలో వణుకు ప్రారంభమవుతుంది. మీరు మీ బొటనవేలు మరియు చూపుడు వేలును ముందుకు వెనుకకు రుద్దవచ్చు. దీనిని పిల్-రోలింగ్ వణుకు అంటారు. మీ చేయి విశ్రాంతిగా ఉన్నప్పుడు లేదా మీరు ఒత్తిడిలో ఉన్నప్పుడు వణుకుతుంది. మీరు ఏదైనా పని చేస్తున్నప్పుడు లేదా కదులుతున్నప్పుడు మీరు తక్కువగా వణుకుతున్నట్లు మీరు గమనించవచ్చు.

నెమ్మదిగా కదలిక, దీనిని బ్రాడికినీసియా అని కూడా పిలుస్తారు. పార్కిన్సన్స్ వ్యాధి మీ కదలికను నెమ్మదిస్తుంది, సాధారణ పనులను మరింత కష్టతరం చేస్తుంది. కుర్చీలోంచి లేవడం, స్నానం చేయడం లేదా దుస్తులు ధరించడం కష్టంగా ఉండవచ్చు. మీ ముఖంలో వ్యక్తీకరణ తక్కువగా ఉండవచ్చు. రెప్పవేయడం కష్టంగా ఉండవచ్చు.

దృఢమైన కండరాలు. మీ శరీరంలోని ఏ భాగంలోనైనా మీకు గట్టి కండరాలు ఉండవచ్చు. మీ కండరాలు ఉద్రిక్తంగా మరియు బాధాకరంగా అనిపించవచ్చు మరియు మీ చేయి కదలికలు పొట్టిగా మరియు కుదుపులకు లోనవుతాయి.

చెడు భంగిమ మరియు సమతుల్యత. మీ భంగిమ వంగిపోవచ్చు. మీరు పడిపోవచ్చు లేదా సమతుల్యత సమస్యలు ఉండవచ్చు.

ఆటోమేటిక్ కదలికలు కోల్పోవడం. మీరు సాధారణంగా ఆలోచించకుండా చేసే కొన్ని కదలికలను తక్కువ చేయగలరు, మీరు నడుస్తున్నప్పుడు రెప్పవేయడం, నవ్వడం లేదా మీ చేతులను ఊపడం వంటివి చేయవచ్చు.

ప్రసంగం మారుతుంది. మీరు మృదువుగా లేదా త్వరగా మాట్లాడవచ్చు, అస్పష్టంగా మాట్లాడవచ్చు లేదా మాట్లాడే ముందు సంకోచించవచ్చు. మీ ప్రసంగం సాధారణ ప్రసంగ విధానాలు లేకుండా చదునుగా లేదా ఏకరీతిగా ఉండవచ్చు.

రాయడంలో మార్పులు. మీకు రాయడంలో ఇబ్బంది ఉండవచ్చు మరియు మీ రచన ఇరుకుగా మరియు చిన్నగా కనిపించవచ్చు.

మోటారు లక్షణాలు లేని లక్షణాలు. వీటిలో నిరాశ, ఆందోళన, మలబద్ధకం మరియు నిద్ర సమస్యలు ఉండవచ్చు. కలలను నటించడం, తరచుగా మూత్ర విసర్జన చేయవలసి రావడం, వాసన చూడటంలో ఇబ్బంది, ఆలోచన మరియు జ్ఞాపకశక్తి సమస్యలు మరియు చాలా అలసిపోయినట్లు అనిపించడం కూడా వీటిలో ఉండవచ్చు. మీకు పార్కిన్సన్స్ వ్యాధి లక్షణాలు ఏవైనా ఉంటే ఆరోగ్య సంరక్షణ నిపుణులను సంప్రదించండి. ఇది మీ పరిస్థితిని నిర్ధారించడానికి మరియు ఇతర కారణాలను తోసిపుచ్చడానికి సహాయపడుతుంది. పార్కిన్సన్స్ వ్యాధిలో, మెదడులోని నాడీ కణాలు న్యూరాన్లు అని పిలువబడేవి నెమ్మదిగా విచ్ఛిన్నమవుతాయి లేదా చనిపోతాయి. మెదడులో రసాయన దూతను ఉత్పత్తి చేసే న్యూరాన్‌ల నష్టం వల్ల పార్కిన్సన్స్ వ్యాధి యొక్క అనేక లక్షణాలు సంభవిస్తాయి. ఈ దూతను డోపమైన్ అంటారు. డోపమైన్ తగ్గడం వల్ల మెదడు కార్యకలాపాలు సక్రమంగా జరగవు. దీనివల్ల కదలిక సమస్యలు మరియు పార్కిన్సన్స్ వ్యాధి యొక్క ఇతర లక్షణాలు వస్తాయి. పార్కిన్సన్స్ వ్యాధి ఉన్నవారు రక్తపోటు వంటి అనేక శరీర విధులను నియంత్రించే నోర్‌పైన్‌ఫ్రైన్ అనే రసాయన దూతను కూడా కోల్పోతారు.

పార్కిన్సన్స్ వ్యాధికి కారణం తెలియదు, కానీ అనేక అంశాలు పాత్ర పోషిస్తున్నట్లు అనిపిస్తుంది, వాటిలో: జన్యువులు. నిర్దిష్ట జన్యు మార్పులు పార్కిన్సన్స్ వ్యాధితో ముడిపడి ఉంటాయి. కానీ చాలా మంది కుటుంబ సభ్యులకు పార్కిన్సన్స్ వ్యాధి ఉంటే తప్ప ఇవి చాలా అరుదు.పర్యావరణ కారకాలు. కొన్ని విషపదార్థాలు లేదా ఇతర పర్యావరణ కారకాలకు గురికావడం వల్ల తరువాత పార్కిన్సన్స్ వ్యాధి వచ్చే ప్రమాదం పెరుగుతుంది.

# చుండ్రు సమస్య ఎందుకు వస్తుంది?



చుండ్రు సమస్యను మనం చాలా చిన్నదిగా భావించినా ఇది మనల్ని అత్యంత ఎక్కువగా చికాకు పెట్టే విషయం. చుండ్రు సమస్యకు వివిధ కారణాలు ఉండవచ్చు, తలలో చుండ్రు ఎక్కువగా ఉండడం వలన నిరంతరం దురద కలుగుతుంది. దీని వలన చేసే పని మీద శ్రద్ద పెట్టలేకపోవచ్చు. దురద ఎక్కువగా ఉందని తల గోకుతూ ఉంటే చర్మంపై పుండ్లు పడవచ్చు. చుండ్రు సమస్య ఎక్కువైతే దాని వలన జుట్టు కూడా ఎక్కువగా రాలుతుంది. ఈ సమస్యకు మొదట్లోనే తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే తీవ్రమయ్యే కొద్దీ మన సాధారణ జీవితాన్ని చాలా ప్రభావితం చేస్తుంది. మరి చుండ్రు సమస్య కారణాలు ఏంటి? చుండ్రు సమస్య లక్షణాలు ఎలా ఉంటాయి తలలో చుండ్రు తగ్గించడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలను ఇక్కడ వివరంగా తెలుసుకుందాం. చుండ్రు అనేది చాలా సాధారణమైన సమస్య. ఇది తలపై చర్మం పొరలుగా ఊడిపోవడాన్ని సూచిస్తుంది. ఇది సాధారణంగా ప్రమాదకరమైనది కానప్పటికీ, తరచుగా చికాకు మరియు ఇబ్బందిని కలిగిస్తుంది.చుండ్రు సమస్య రావడానికి గల ప్రధాన కారణాలు ఇక్కడ వివరంగా ఇవ్వబడ్డాయి:

మలస్సేజియా ఫంగస్: ఈ ఫంగస్ దాదాపు అందరి తలపై సహజంగా ఉంటుంది. ఇది తలపై ఉండే నూనెలను (సెబమ్) ఆహారంగా తీసుకుంటుంది. ఈ ప్రక్రియలో, ఇది ఒలియిక్ యాసిడ్ (ాశ్రీవఱషాఖాఏఱస) అనే ఉపఉత్పత్తిని విడుదల చేస్తుంది.కొంతమంది వ్యక్తులు ఈ ఒలియిక్ యాసిడ్‌కు చాలా సున్నితంగా ఉంటారు. దీనికి ప్రతిస్పందనగా, వారి శరీరం తలపై చర్మ కణాలను సాధారణం కంటే వేగంగా తొలగించడం ప్రారంభిస్తుంది. ఈ చనిపోయిన చర్మ కణాలే పొరలుగా ఏర్పడి, చుండ్రుగా కనిపిస్తాయి.

సెబోర్హెయిక్ డెర్మాటిటిస్ : ఇది చుండ్రుకు సంబంధించిన ఒక తీవ్రమైన చర్మ సమస్య, ఈ పరిస్థితిలో తల చర్మం ఎర్రగా, జిడ్డుగా, పొలుసులుగా మారుతుంది. ఇది తరచుగా ముక్కు పక్కన, చెవుల వెనుక, కనుబొమ్మలపై మరియు ఛాతీపై కూడా రావచ్చు. చర్మంపై ఎక్కువ నూనె ఉత్పత్తి అయినప్పుడు (సెబమ్) మలస్సేజియా ఫంగస్ విపరీతంగా పెరగడం వల్ల ఈ సమస్య తీవ్రమవుతుంది.సాధారణ చుండ్రు కంటే సెబోర్హెయిక్ డెర్మాటిటిస్ వల్ల వచ్చే చుండ్రు పొలుసులు పెద్దవిగా, పసుపు రంగులో మరియు జిడ్డుగా ఉంటాయి. తలను సరిగ్గా లేదా తరచుగా శుభ్రం చేయకపోవడం వల్ల చుండ్రు సమస్య పెరుగుతుంది. తలను ఎక్కువ రోజులు కడగకుండా ఉంటే, చర్మంపై నూనెలు (సెబమ్), చర్మ కణాలు మరియు మురికి పేరుకుపోతాయి. ఇది మలస్సేజియా ఫంగస్ మరింత వృద్ధి చెందడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఫలితంగా చుండ్రు పొరలు స్పష్టంగా, మరియు దురద ఎక్కువగా కనిపిస్తాయి.

పొడి చర్మం కూడా చుండ్రుగా పొరలుగా రాలడానికి ఒక కారణం కావచ్చు. ముఖ్యంగా శీతాకాలంలో చర్మం పొడిబారడం సహజం. పొడి చర్మం వల్ల వచ్చే చుండ్రు పొలుసులు సాధారణంగా చిన్నగా, తెల్లగా ఉంటాయి మరియు తలపై అంతగా జిడ్డుగా ఉండవు. తల దువ్వినప్పుడు ఈ చుండ్రు తేలికగా రాలిపోతుంది. వేడి నీటితో తరచుగా తలస్నానం చేయడం కూడా చర్మాన్ని మరింత పొడిగా మారుస్తుంది.

# తేలుకుంచి పక్షుల విడిది కేంద్రంపై నిర్లక్ష్యం



**ఇచ్ఛాపురం, పతాకం న్యూస్:** జిల్లాలో ఉన్న విదేశీ విహంగ కేంద్రాల్లో ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి ఒకటి. ఈ ప్రాంతం చిత్తడి, తంపర నేలలకు ప్రసిద్ధి కావడంతో ఇక్కడ పక్షులకు సమృద్ధిగా ఆహారం లభిస్తుంది. సంతానోత్పత్తికి అనుకూలమైన వాతావరణం ఈ ప్రాంతం సొంతం. అందుకే ఏటా ఇక్కడకు సైబిరియా, జర్మనీ, ఆస్ట్రేలియా, సింగపూర్, మలేసియా, హంగేరి దేశాల నుంచి సుమారు ఆరు వేల కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడకు విదేశీ పక్షులు చేరుతుంటాయి. ముఖ్యంగా సెప్టెంబరు, అక్టోబరులో ఇక్కడకు వస్తుంటాయి. సుమారు ఆరేడు, నెలల పాటు ఇక్కడే ఉంటాయి. గుడ్లు పెట్టి సంతానోత్పత్తి జరుపుతాయి. పిల్లలు పెద్దాయ్యాక మార్చి, ఏప్రిల్‌లో తిరుగు పయనమవుతాయి. ఇవి వస్తే పంటలు బాగా పండుతాయని రైతుల ప్రగాఢ నమ్మకం. అయితే, ఈ కేంద్రాన్ని అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. విదేశీ పక్షుల కోసం ఇక్కడ సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో సంతానోత్పత్తి చేసే క్రమంలో గుడ్లతో పాటు పక్షులు కిందకు జారిపడి మృత్యువాతపడుతున్నాయి. ఇంత జరుగుతున్నా అటవీ, పర్యాటక శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. కనీసం చెట్లకు వలలు ఏర్పాటు చేసినా కొంత వరకు పక్షుల మృత్యువాతను అడ్డుకోవచ్చు. కానీ అటువంటి ఏర్పాట్లు ఏవీ చేయడం లేదు. దీనికితోడు కోతులతో పక్షులకు అష్టకష్టాలు తప్పడం లేదు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా ఈ కేంద్రాన్ని గాలికొదిలేసింది. పరిసరాలు అధ్వానంగా మారాయి. అటు పక్షుల మల, మూత్ర విసర్జనతో తీవ్ర దుర్వాసన వస్తోంది. దీంతో స్థానికులు దుర్గంధం మాటున గడపాల్సి వస్తోంది. కనీసం చుట్టుపక్కల ప్రాంతాల్లో చెరువులను అభివృద్ధి చేస్తే పక్షులకు కొంతవరకు ఉపయోగపడే అవకాశముంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విదేశీ పక్షుల విడిది కేంద్రంపై దృష్టి సారించింది. అవసరమైన ఏర్పాట్లకు త్వరలో నిధులు విడుదల అవుతాయని పర్యాటక, అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. అటవీ, పర్యాటక శాఖ సంయుక్తంగా చర్యలు చేపడితే విదేశీ పక్షుల విడిది కేంద్రం అభివృద్ధి చెందే అవకాశముంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ కొన్నిరకాల నిర్మాణాలు జరిగాయి. చివరిగా 2019లో టీడీపీ ప్రభుత్వం కీలక ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అధికారం మారడంతో అవన్నీ బుట్టదాఖలు అయ్యాయి. వైసీపీ ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదు. గత ఐదేళ్లలో పర్యాటక శాఖకు ఎటువంటి కేటాయింపులు లేవు. ప్రస్తుతం తేలుకుంచితో పాటు తేలినీలాపురం పక్షుల విడిది కేంద్రానికి సంబంధించి కీలక ప్రతిపాదనలు వెళ్లాయి. వాటికి అనుగుణంగా ప్రభుత్వం నిధులు విడుదల చేసే అవకాశముంది.

# ఖర్గే, రాహుల్ గాంధీతో భేటీ అనంతరం కీలక ప్రకటన చేసిన శశి థరూర్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** సీనియర్ కాంగ్రెస్ నేత, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్.. పార్టీ నాయకత్వంతో తనకున్న విభేదాలపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. గురువారం నాడు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో సమావేశమైన అనంతరం, తామంతా ఒకే మాటపై ఉన్నామని స్పష్టం చేశారు. ఈ భేటీతో పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాల చర్చకు ముగింపు పలికే ప్రయత్నం చేశారు. పార్లమెంట్ భవనంలోని ఖర్గే ఛాంబర్‌లో దాదాపు రెండు గంటల పాటు ఈ సమావేశం జరిగింది. ఉదయం 11:15 గంటలకు ప్రారంభమైన ఈ భేటీలో మొదట కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా పాల్గొన్నారు. అయితే, చర్చలు ప్రారంభమైన కొద్దిసేపటికే ఆయన బయటకు వెళ్లిపోవడంతో ఖర్గే, రాహుల్, థరూర్ మధ్య ప్రైవేట్‌గా సంభాషణ కొనసాగింది. మధ్యాహ్నం 1:15 గంటలకు సమావేశం నుంచి బయటకు వచ్చిన థరూర్ ప్రశాంతంగా కనిపించారు. మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, "మా మధ్య సమావేశం జరిగింది. చెప్పాలనుకున్నవన్నీ చెప్పాం. ఇప్పుడు మేమంతా ఒకే మాటపై ఉన్నాం" అని అన్నారు. అనంతరం సోషల్ మీడియాలో స్పందించిన ఆయన, ఈ చర్చలు స్నేహపూర్వకంగా, ఫలప్రదంగా జరిగాయని పేర్కొన్నారు. భారత ప్రజలకు సేవ చేసే క్రమంలో పార్టీ ముందుకు సాగుతున్నప్పుడు నాయకత్వం అంతా ఒకే తాటిపై ఉందని స్పష్టం చేశారు. పార్టీ పనితీరుపై థరూర్ అసంతృప్తితో ఉన్నారంటూ ఇటీవల వెలువడిన వార్తల నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. రాబోయే కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొంటారా అని మీడియా ప్రశ్నించగా, థరూర్ సానుకూలంగా స్పందించారు. తన నియోజకవర్గ ప్రజలకు, రాష్ట్రంలో పార్టీకి కట్టుబడి ఉన్నానని పునరుద్ఘాటించారు. భేటీ తర్వాత, సోషల్ మీడియా పోస్ట్ ద్వారా థరూర్ రెండుసార్లు ఐక్యత సందేశాన్ని వినిపించడంతో.. పార్టీలో నెలకొన్న ఊహాగానాలకు ప్రస్తుతానికి తెరపడినట్లేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.




# ఫిబ్రవరి 4న వాషింగ్టన్ సుందర్‌కు ఫిట్‌నెస్ పరీక్ష



టీ20 ప్రపంచకప్ 2026 ముంగిట టీమిండియాలో ఆందోళన నెలకొంది. స్టార్ స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ టోర్నీలో ఆడటంపై అనుమానాలు నెలకొన్నాయి. గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో అతని ఫిట్‌నెస్‌ను నిర్ధారించేందుకు ఫిబ్రవరి 4న బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కీలక ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నెల 11న న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో సుందర్ పక్కటెముకల గాయానికి గురయ్యాడు. అతను కోలుకోవడానికి అనుకున్నదానికంటే ఎక్కువ సమయం పడుతోంది. సుందర్ నుంచి అధికారిక మెడికల్ అప్‌డేట్ వచ్చేవరకు ఎలాంటి ప్రత్యామ్నాయం ప్రకటించకూడదని సెలక్టర్లు, టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయించుకున్నట్టు తెలిసింది. నిబంధనల ప్రకారం ఈ నెల 30లోపు జట్లలో మార్పులు చేసుకోవచ్చు. అయితే, టోర్నమెంట్ టెక్నికల్ కమిటీ అనుమతిస్తే గాయం కారణంగా టోర్నీ మధ్యలో కూడా ఆటగాళ్లను మార్చుకునే అవకాశం ఉంటుంది.

భారత జట్టు ఫిబ్రవరి 3న ముంబైలో సమావేశమై, ఫిబ్రవరి 4న దక్షిణాఫ్రికాతో వార్మప్ మ్యాచ్ ఆడనుంది. అదే రోజు సుందర్‌కు ఫిట్‌నెస్ టెస్ట్ జరగనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. బీసీసీఐ వర్గాల సమాచారం ప్రకారం సుందర్‌కు పక్కటెముకల దగ్గర కండరాల్లో చీలిక ఏర్పడినట్టు తెలుస్తోంది. గాయం నుంచి సహజంగా కోలుకున్న తర్వాతే అతను తిరిగి మైదానంలోకి రావాల్సి ఉంటుందని ఓ అధికారి తెలిపారు.

ఒకవేళ సుందర్ అందుబాటులో లేకపోతే అతని స్థానంలో రియాన్ పరాగ్‌ను ప్రధాన ప్రత్యామ్నాయంగా చూస్తున్నట్లు సమాచారం. వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ జట్టులో ఉండటంతో టీమ్ బ్యాలెన్స్ పటిష్ఠంగానే కనిపిస్తోంది. ఒకవేళ సుందర్ టోర్నీ చివరి దశకైనా అందుబాటులోకి వస్తాడని భావిస్తే, అతని కోసం వేచి చూసే అవకాశం కూడా ఉందని సమాచారం.


# నాలుగో టీ20లో టీమిండియాపై న్యూజిలాండ్ విజయం




ఆల్‌రౌండర్ శివం దూబే (23 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్స్‌లతో 65) ధనాధన్ అర్ధశతకంతో అదరగొట్టినా.. మిగతా బ్యాటర్ల వైఫల్యంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. నాలుగో టీ20లో టీమిండియా 50 పరుగుల తేడాతో న్యూజిలాండ్ చేతిలో ఓడింది. తొలుత కివీస్ నిర్ణీత 20 ఓవర్లలో 215/7 స్కోరు చేసింది. టిమ్ సీఫెర్ట్ (36 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 62) అర్ధ శతకం సాధించగా.. కాన్వే (44), డారెల్ మిచెల్ (39 నాటౌట్) రాణించారు. అర్ష్‌దీప్, కుల్దీప్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఛేదనలో భారత్ 18.4 ఓవర్లలో 165 పరుగులకు కుప్పకూలింది. రింకూ సింగ్ (39), సంజూ శాంసన్ (24) ఫర్వాలేదనిపించారు. శాంట్నర్ మూడు వికెట్లు పడగొట్టగా.. జాకబ్ డఫీ, ఇష్ సోధీ చెరో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. ఈ విజయంతో ఐదు టీ20ల సిర?సలో న్యూజిలాండ్ 1-3తో భారత్ ఆధిక్యాన్ని తగ్గించింది. ఫిట్‌నెస్ లోపంతో ఇషాన్ కిషన్ ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. సీఫెర్ట్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ అభిషేక్ శర్మ (0) డకౌట్ కాగా.. రెండో ఓవర్లో సూర్యకుమార్ (8)ను డఫీ రిటర్న్ క్యాచ్‌తో వెనక్కిపంపాడు.. 9 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన తరుణంలో శాంసన్, రింకూ మూడో వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. దీంతో భారత్ ఆరు ఓవర్లకు 53/2తో నిలిచింది. అయితే, శాంసన్, హార్దిక్ పాండ్యా (2)ను శాంట్నర్, తర్వాత రింకూను ఫోక్స్ ఎల్బీ చేశారు. అయితే ఈ దశలో ఒక్కసారిగా విజృంభించిన దూబే.. విజయంపై ఆశలు రేపాడు. సోధీ వేసిన 12వ ఓవర్‌లో దూబే రెండు ఫోర్లు, మూడు సిక్స్‌లతో కలిపి 29 పరుగులు పిండుకోవడంతో స్కోరు బోర్డు ఊపందుకొంది. ఈ క్రమంలో రాణా (9)తో కలసి దూబే ఆరో వికెట్‌కు 63 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. కానీ, దూబే రనౌట్ కావడంతో టీమిండియా పరాజయం లాంఛనమే అయింది. విజయానికి చివరి 30 బంతుల్లో 71 పరుగులు కావల్సి ఉండగా.. హర్షిత్, అర్ష్‌దీప్ (0), బుమ్రా (4), కుల్దీప్ (1) పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఓపెనర్లు కాన్వే, సీఫెర్ట్ పవర్‌ప్లేలో అదరగొట్టడంతో.. న్యూజిలాండ్ భారీ స్కోరు చేసింది. తొలి వికెట్‌కు వీరిద్దరూ 100 పరుగుల భాగస్వామ్యంతో పటిష్ట పునాది వేశారు. టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ ఆరంభం నుంచే భారత బౌలర్లపై విరుచుకుపడింది. ముఖ్యంగా సీఫెర్ట్ ఎడాపెడా షాట్లతో స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. దీంతో పవర్‌ప్లేను కివీస్ 71/0తో ముగించింది. 9వ ఓవర్‌లో కాన్వేను అవుట్ చేసిన కుల్దీప్ జట్టుకు తొలి బ్రేక్ అందించాడు. ఆ వెంటనే రచిన్ (2)ను బుమ్రా వెనక్కి పంపాడు. ఇక సీఫెర్ట్‌ను అర్ష్‌దీప్ క్యాచవుట్ చేశాడు. ఫిలిప్స్ (24)ను కుల్దీప్.. చాప్‌మన్ (9)ను బిష్ణోయ్ పెవిలియన్‌కు చేర్చారు. కెప్టెన్ శాంట్నర్ (11)ను పాండ్యా అద్భుత త్రోతో రనౌట్ చేయగా..ఫోక్స్(13)ను అర్ష్‌దీప్ పెవిలియన్ చేర్చాడు. కానీ, డెత్ ఓవర్లలో మిచెల్ ధాటిగా ఆడడంతో టీమ్ స్కోరు 200 పరుగుల మార్క్ దాటింది.




# ఒకవైపు 'కల్కి 2', మరోవైపు 'స్పిరిట్'




పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ మళ్లీ గేర్ మార్చారు. 'ది రాజా సాబ్' సినిమాతో ఫ్యాన్స్‌ను పలకరించినా, వారికి ఆకలి పూర్తిగా తీరలేదు. బాక్సా ఫీస్ వద్ద ఆశించిన మ్యాజిక్ జరగలేదు. కానీ, ఇప్పుడు ప్రభాస్ తీసుకున్న నిర్ణయం అభిమానులకు ఫుల్ మీల్స్ లాగా ఉండబోతోంది. డార్లింగ్ ఇక రెస్ట్ తీసుకునే మూడ్‌లో లేరు. ఫిబ్రవరి నెలలో బాక్సాఫీస్ వేటను మళ్లీ మొదలుపెట్టబోతున్నారు. అది కూడా ఒక్క సినిమాతో కాదు, దేశం మొత్తం ఎదురుచూస్తున్న రెండు భారీ క్రేజీ ప్రాజెక్టులతో ఏకకాలంలో యుద్ధానికి దిగుతున్నారని టాక్ వినిపిస్తోంది. ప్రభాస్ లైనప్ చూసి ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాలే ఆశ్చర్యపోతున్నాయి. ఇటీవలే విడుదలైన 'ది రాజా సాబ్' సినిమా మిశ్రమ ఫలితాన్ని అందుకుంది. ప్రభాస్ ఎంత కష్టపడినా, ఆ సినిమా అభిమానులను పూర్తిస్థాయిలో సంతృప్తి పరచలేకపోయింది. అయితే ఆ ఫలితాన్ని ప్రభాస్ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. తన తదుపరి సినిమాలపైనే పూర్తి దృష్టి సారించారు. అభిమానులకు కావాల్సిన అసలైన మాస్, యాక్షన్ విందును వడ్డించడానికి సిద్ధమయ్యారు. సోషల్ మీడియాలో, ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తున్న బజ్ ప్రకారం, ప్రభాస్ ఫిబ్రవరిలో ఫుల్ బిజీ కాబోతున్నారు. ఫిబ్రవరి 2, 2026 నుంచి ఆయన 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ షూటింగ్‌లో అడుగుపెట్టబోతున్నారు. దర్శకుడు నాగ్ అశ్విన్ ఇప్పటికే స్క్రిప్ట్, ప్రీ-ప్రొడక్షన్ పనులు పూర్తి చేశారు. మొదటి భాగం సృష్టించిన సంచలనం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇప్పుడు సీక్వెల్‌లో భైరవ పాత్ర మరింత పవర్ ఫుల్‌గా ఉండబోతోంది. ఆ ఫ్యూచరిస్టిక్ ప్రపంచంలోకి ప్రభాస్ మళ్లీ ఎంట్రీ ఇవ్వబోతున్నారు.

ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. కల్కి సెట్స్‌లో అడుగుపెట్టిన రెండు వారాలకే ప్రభాస్ మరో సెట్‌కి జంప్ అవుతున్నారు. ఫిబ్రవరి 15 నుంచి సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న 'స్పిరిట్' షూటింగ్‌లో జాయిన్ అవుతున్నారు. 'యానిమల్' తర్వాత సందీప్ చేస్తున్న సినిమా కావడంతో దీనిపై అంచనాలు ఉన్నాయి. ఇందులో ప్రభాస్ ఒక పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నారని ఇంతకు ముందే సందీప్ చెప్పిన విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ముస్సోరీలో జరగనుందని సమాచారం. మరో రెండు, మూడు రోజుల్లోనే ముస్సోరీలో షెడ్యూల్ ప్రారంభం కానుంది. ప్రభాస్ షెడ్యూల్ చూస్తుంటే ఫిబ్రవరి నెల మొత్తం ఆయనకు ఒక్క రోజు కూడా విశ్రాంతి ఉండేలా లేదు. ఉదయం ఒక సెట్, సాయంత్రం మరో డిస్కషన్ అన్నట్లుగా ఆయన డైరీ ప్యాక్ అయిపోయింది. ఒకవైపు గ్రాఫిక్స్ మాయాజాలం ఉన్న 'కల్కి', మరోవైపు వాయిలెన్స్ నిండిన 'స్పిరిట్'. ఈ రెండు విభిన్నమైన జోనర్లను ప్రభాస్ బ్యాలెన్స్ చేయబోతున్నారు. ఇవి రెండే కాదు, ప్రభాస్ చేతిలో మరో క్రేజీ ప్రాజెక్ట్ కూడా ఉంది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఫౌజీ' సినిమాను కూడా ఆయన పూర్తి చేయాల్సి ఉంది. ఈ సినిమా షూటింగ్ కూడా సమాంతరంగా జరిగే అవకాశం ఉంది. ఇలా వరుస పెట్టి మూడు భారీ సినిమాలను ఆయన భుజాలపై మోస్తున్నారు. ప్రస్తుతానికి ఇవి రూమర్స్ అయినప్పటికీ, విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం రాబోయే రోజుల్లో నిర్మాణ సంస్థల నుంచి అధికారిక ప్రకటనలు వచ్చే అవకాశం ఉంది. అదే జరిగితే ప్రభాస్ అభిమానులకు అంతకంటే కావాల్సింది ఏముంటుంది? రెబల్ స్టార్ స్పీడ్ చూస్తుంటే, ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులు మళ్లీ తిరగరాయడం ఖాయంగా కనిపిస్తోందని సినీ విశ్లేషకులు అంటున్నారు.

### ఫిబ్రవరి 5 నుంచి జోర్డాన్‌లో

# జూ.ఎన్టీఆర్ షూటింగ్



యంగ్ టైగర్ ఎన్టీఆర్, సంచలన డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్లో భారీ బడ్జెట్ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్డేట్ బయటకు వచ్చింది. సినిమా నెక్స్ట్ షెడ్యూల్ ఫిబ్రవరి 5 నుంచి జోర్డాన్ జరగబోతోందని తెలుస్తోంది. హైవోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలను ఈ షెడ్యూల్ లో చిత్రీకరించబోతున్నారు. ఈ కీలక షెడ్యూల్ షూటింగ్ కు సంబంధించి అన్ని ఏర్పాట్లను చిత్ర యూనిట్ పూర్తి చేసింది. అయితే, షూటింగ్ ప్రారంభానికి రెండు, మూడు రోజుల ముందే జూనియర్ ఎన్టీఆర్ జోర్డాన్‌కు వెళుతున్నట్లు సమాచారం. ముందే వెళితే అక్కడి వాతావరణానికి అలవాటు పడవచ్చునేది తారక్ ఆలోచనగా తెలుస్తోంది. మరోవైపు ఈ సినిమాపై ఇప్పటికే పాన్ ఇండియా లెవెల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తుందని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.




### రూ.1000 కోట్ల గ్రాస్ వసూళ్లు.. బాక్సాఫీస్ వద్ద

# 'ధురంధర్' సరికొత్త చరిత్ర!

ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించిన చిత్రం

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ హీరోగా, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ధురంధర్' చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. 2025 డిసెంబర్ 5న విడుదలైన ఈ సినిమా తాజాగా భారత మార్కెట్‌లో రూ.1000 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని అధిగమించింది. ట్రేడింగ్ వెబ్‌సైట్ శాక్‌నిల్క్ ఈ వివరాలను వెల్లడించింది. ఈ ఘనత సాధించిన నాలుగో భారతీయ చిత్రంగా 'ధురంధర్' నిలిచింది.

ఇప్పటివరకు ఈ రికార్డు 'బాహుబలి 2: ది కన్‌క్లూజన్' (రూ.1417 కోట్లు), 'కేజీఎఫ్: ఛాప్టర్ 2' (రూ.1001 కోట్లు), 'పుష్ప 2: ది రూల్' (రూ.1471.1 కోట్లు) పేరిట మాత్రమే ఉండేది. ఇప్పుడు ఆ చిత్రాల సరసన 'ధురంధర్' కూడా చేరింది. అయితే, ఈ సినిమా సాధించిన విజయంలో ఒక ప్రత్యేకత ఉంది. ఇంతకుముందు వెయ్యి కోట్లు వసూలు చేసిన చిత్రాలన్నీ బహుళ భాషల్లో విడుదల కాగా, 'ధురంధర్' మాత్రం కేవలం ఒకే భాష(హిందీ)లో విడుదలై ఈ అరుదైన ఘనతను సొంతం చేసుకోవడం విశేషం.

శాక్‌నిల్క్ రిపోర్ట్ ప్రకారం, 56వ రోజు నాటికి ఈ సినిమా నెట్ కలెక్షన్లు రూ.835.6 కోట్లుగా ఉన్నాయి. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ పాకిస్థాన్‌కు చెందిన



నలుగురు డేంజరస్ టెర్రరిస్టులను ఎదుర్కొనే పాత్రలో నటించారు. ఆయన పాత్ర మేజర్ మోహిత్ శర్మను స్ఫూర్తిగా తీసుకుని రూపొందించారని ప్రచారం జరిగినా, అది పూర్తిగా కల్పితమని సెన్సార్ బోర్డు స్పష్టం చేసింది. ఈ చిత్రంలో పాకిస్థాన్‌లోని వివిధ జాతుల మధ్య ఉన్న సామాజిక-రాజకీయ అంశాలను కూడా లోతుగా చర్చించారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**